ప్రజాశక్తి

గురువారం 5 అక్టోబర్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఉక్కు రక్షణ యాత్ర బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

స్టీల్‌ప్లాంట్ రక్షణే లక్ష్యంగా..

నేటి సిపిఎం బహిరంగ సభకు సర్వం సిద్ధం

- సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి రాక
- సభకు ప్రజలంతా తరలిరావాలి : జగ్గునాయుడు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యాన గురువారం సాయంత్రం 4.30 గంటలకు జరుగనున్న భారీ బహిరంగ సభకు సర్వం సిద్ధమైంది. సిపిఎం సారధ్యంలో సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 1 వరకూ చేపట్టిన 'ఉత్తరాంధ్ర ఉక్కు రక్షణ యాత్ర' విజయవంతమైంది. 12 రోజుల పాటు ఉత్తరాంధ్ర ప్రాంతంలోని 6 జిల్లాల్లో 1500 కిలోమీటర్ల మేర ఈ బైక్ యాత్ర సాగింది. అక్టోబర్ 2 నుంచి విశాఖ జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోగల నియోజకవర్గాల్లోనూ ఆటో జాతాలు కూడా పార్టీ నిర్వహించింది. ఉక్కు రక్షణ యాత్రలో రైతులు, కార్మికులు, వ్యవసాయదారులు, మహిళలు, విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, వ్యాపారవర్గాల వారిని స్టీల్‌ప్లాంట్ రక్షణ విషయమై చైతన్యవంతం చేయడం జరిగింది. ఈ నెల 5 అంటే గురువారం సాయంత్రం 4.30 గంటలకు కూర్మన్నపాలెం జంక్షన్‌లోని స్టీల్‌ప్లాంట్ ప్రధాన గేటు వద్ద నిర్వహించే భారీ బహిరంగ సభలో ప్రధాన వక్తగా సిపిఎం ఆలిండియా జనరల్ సెక్రటరీ సీతారాం ఏచూరి, పార్టీ ఎపి రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు ప్రసంగించనున్నారు. ఆటో జాతాలు కూడా 5వ తేదీ సాయంత్రం నాటికి బహిరంగ సభా ప్రాంగణానికి చేరుకుని యాత్రను ముగించనున్నాయి. విశాఖలోని వివిధ తరగతులకు చెందిన ప్రజలు, కార్మికులు అన్ని తరగతులూ ఈ బహిరంగ సభకు తరలిరావాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో కోరారు.

విస్తృత ప్రచారం...

గడచిన 12 రోజులుగా ఉత్తరాంధ్ర జిల్లాల్లోని కార్మిక, ప్రజానీకం నివాస ప్రాంతాలు, పరిశ్రమల గేట్లు, విద్యాసంస్థల్లోనూ విస్తృతంగా బైక్ యాత్ర ప్రజాచైతన్యం కలిగించింది. ప్రజాసంఘాలు జనరల్ బాడీ మీటింగుల ద్వారా పలు దఫాలు ప్రచారం పూర్తిచేశాయి. సుమారు 3 లక్షల కరపత్రాలను స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజానీకంలో పంపిణీ చేశారు. ప్రజానాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన వీధి నాటికలు, నృత్యగీతాలు, జానపద, దేశభక్తి గేయాలు ఇతర అన్ని

మిగతా 2లో..

పరిశ్రమల స్థాపనతో ప్రజలకు ఉపాధి

- కృష్ణాపురంలో సెకండరీ మిల్లెట్స్ ప్రాసెసింగ్ యూనిట్, మద్దిలో ఓరిల్ ఫుడ్స్ పరిశ్రమకు భూమి పూజ
- విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి- పద్మనాభం : పరిశ్రమల స్థాపనతో నిరుద్యోగులకు, యువతకు ఉపాధి కలుగుతుందని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలలో మొత్తం రూ.2958.69 కోట్లతో ఏర్పాటుచేయనున్న ఏడు పరిశ్రమల యూనిట్లు, 6 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, 13 సెకండరీ మిల్లెట్స్ ప్రాసెసింగ్ యూనిట్లకు వర్చువల్‌గా ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఇందులో భాగంగా విశాఖ జిల్లాకు సంబంధించి పద్మనాభం మండలం కృష్ణాపురం గ్రామంలో రూ.4.46 కోట్ల ఖర్చుతో ఏర్పాటు చేయనున్న సెకండరీ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిటుకు, రూ.52 కోట్లతో మద్ది గ్రామంలో ఓరిల్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమకు ముఖ్యమంత్రి వర్చువల్‌గా భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి స్థానికంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ, ఈ పరిశ్రమల వల్ల స్థానిక ప్రజలకు, నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందన్నారు. మిల్లెట్స్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు వల్ల పరిసర రైతులకు లబ్ది చేకూరుతుందని తెలిపారు. ఓరిల్ ఫుడ్స్ పరిశ్రమ ఏర్పాటు వల్ల సుమారు 400 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు.

మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న నాలుగు రూరల్ మండలాలలో మూడు భీమిలి నియోజకవర్గంలో ఉన్నాయని అన్నారు. ఇక్కడ 90 శాతం రైతులు ఉన్నారని, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ఇక్కడకు రావడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. గోరంట్లలో రూ.25 కోట్లతో ఎక్సైజ్ పార్క్, కనపాంలో ఎంఎస్ఎంఇ పార్క్ కూడా రానుందని చెప్పారు. పద్మనాభం ఎంపిడిఒ కార్యాలయం నుంచి జరిగిన కార్యక్రమంలో ఓరిల్ ఫుడ్స్ సిఇఒ దాసరి అవినాష్, భీమిలి ఆర్‌డిఒ భాస్కర్‌రెడ్డి, పద్మనాభం ఎంపిడిఒ విజయ్‌కుమార్, ఎంపిపి రాంబాబు, ఎపి ఫుడ్ ప్రాసెసింగ్, హార్టికల్చర్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎయు రిజిస్ట్రార్‌గా జేమ్స్ స్టీఫెన్

▶ వార్త 4లో..

లీగ్ క్రికెట్ టోర్నీలో సిటీ పోలీసు జట్టు విజయం

▶ వార్త 4లో..

ఎయు ఇంజినీరింగ్ విద్యార్థులకు నూతన మెస్

▶ వార్త 3లో..

ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలి : జెసి

▶ వార్త 6లో..

కూర్మన్నపాలెం కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ప్రజాశక్తి సిబ్బంది

న్యూస్ క్లిక్‌పై దాడి హేయం

ఏపీడబ్ల్యూజేఎఫ్, సిఐటియు ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి - విశాఖపట్నం : స్వతంత్ర ఆన్ లైన్ పోర్టల్ న్యూస్ క్లిక్‌పై మోడీ సర్కారు ఉక్కు పాదం మోపడాన్ని ఖండిస్తూ కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్దనున్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యాన బుధవారం ప్రజాశక్తి జర్నలిస్టులు, సిబ్బంది నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, న్యూస్‌క్లిక్‌పై బిజెపి ప్రభుత్వం అసత్య ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. ఉపా చట్టం కింద నేరపూరిత కుట్రలకు పాల్పడుతూ పలు కేసులు పెట్టడం గర్హనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వానికి ఇష్టం లేని వార్తలు ప్రసారం చేస్తున్నందునే ప్రముఖ పాత్రికేయుడు, రచయిత

మిగతా 2లో..

నేటి నుంచి అంతరిక్ష వారోత్సవాలు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్), భారతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) ఆధ్వర్యాన విశాఖలోని రఘు ఇంజినీరింగ్ కళాశాల వేదికగా ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు - 2023ను గురువారం నుంచి నాలుగు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు మేఘాలయ హోటల్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో రఘు విద్యాసంస్థల ఛైర్మన్ కలిదిండి రఘు, షార్ శాస్త్రవేత్త, విశాఖ రీజియన్ కార్యక్రమ నిర్వహణ సబ్ కమిటీ ఛైర్మన్ జి.అప్పన్న కార్యక్రమాల వివరాలు వెల్లడించారు.

ప్రభుత్వ ప్రయివేట్ విద్యా సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో ఎగ్జిబిషన్, వివిధ పోటీలు, ఇస్రో శాస్త్రవేత్తలతో ప్రత్యేక ప్రసంగాలు, సీనియర్ ఇస్రో శాస్త్రవేత్తలతో ప్రత్యేక వీడియో ప్రసంగాలు, ఇంటరాక్షన్ కార్యక్రమాలు దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాల వేదికగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం 7 గంటలకు ప్రజల్లో అంతరిక్షంపై అవగాహన కలిగిస్తూ ఆర్కె నుంచి స్పేస్ వాక్ నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు స్పేస్ వీక్ 2023 వేడుకలను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్, ఎస్‌డిఎస్‌సి, షార్, ఇస్రో డిప్యూటీ డైరెక్టర్ జి.రమేష్‌బాబు ప్రారంభిస్తారని చెప్పారు. అదే రోజు యుజి, పిజి విద్యార్థులకు ఫొటోగ్రఫీ, క్విజ్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 6వ తేదీన 6 నుంచి 12 తరగతుల విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు, ఇంజినీరింగ్ విద్యార్థులకు సింపోసియం జరుగుతాయని చెప్పారు. 7వ తేదీ 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు చిత్రలేఖనం, 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్, యుజి, పిజి విద్యార్థులకు క్విజ్ ఫైనల్ రౌండ్ పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ నెల 8న నిర్వహించే ముగింపు వేడుకలకు డిఆర్‌డిఒ నేవల్ సైన్స్ అండ్ మెటీరియల్స్

కార్యక్రమాల పోస్టర్‌ను విడుదలచేస్తున్న ప్రతినిధులు

డైరెక్టర్ జనరల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, జెఎన్‌టియు విజయనగరం విసి ఆచార్య కె.వెంకట సుబ్బయ్య, షార్ చీఫ్ జనరల్ మేనేజర్ పి. వెంకటరెడ్డి అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులను అందజేస్తారని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రఘు కళాశాలలో ఎగ్జిబిషన్‌ను తిలకించడానికి విద్యార్థులను, ప్రజలను అనుమతిస్తారన్నారు.

మొదటి పేజీ తరువాయి..

నేటి సిపిఎం బహిరంగ సభకు సర్వం సిద్ధం

రకాల సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా 12 రోజుల పాటు ఉత్తరాంధ్ర ప్రాంతంలో ప్రజాచైతన్యాన్ని రగిలించాయి. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి కార్మికులు, వారి కుటుంబాలతో సహా ఈనెల 5న సాయంత్రం స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్దకు సభలో పాల్గొనేందుకు రావాలని పిలుపునిచ్చారు.

న్యూస్ క్లిక్‌పై దాడి హేయం

ప్రబీర్ పుర్కాయస్త నేతృత్వంలో నడుస్తున్న ఆ పోర్టల్ పై ఆరోపణలు చేస్తూ అక్రమ కేసులతో వేధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. మోడీ ప్రభుత్వ నిరంకుశ విధానాలు, మీడియాపై దాడులు, వేధింపులు వల్ల ఇప్పటికే దేశం ప్రపంచ పత్రికా స్వాతంత్ర్యంలో అట్టడుగు స్థాయికి చేరిందని గుర్తు చేశారు. న్యూస్‌క్లిక్‌పై దాడిని దేశంలో మీడియా స్వేచ్ఛపైనా, ప్రజల భావ ప్రకటన స్వేచ్ఛపైనా దాడిగా పేర్కొన్నారు. మీడియాపై దాడులను సహించేది లేదని హెచ్చరించారు. మీడియా స్వేచ్ఛపై దాడి సిగ్గు సిగ్గు, మోడీ నిరంకుశత్వం నశించాలి అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎన్.మధుసూదన్‌రావు, జి.కాంతారావు, కె.అప్పలనాయుడు, ఎం.వెంకటేశ్వరరావు, వై.సత్యనారాయణ, రాజేష్‌రెడ్డి, కె.చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : న్యూస్ క్లిక్‌పై దాడులు, సోదాలను ఖండిస్తూ సిఐటియు ఆధ్వర్యాన అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వ హయాంలో మీడియాపై దాడులు పెరిగాయని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మీడియాను అణచివేయడానికి దర్యాప్తు సంస్థలను మోడీ ప్రభుత్వం దుర్వినియోగపరుస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి శ్రీనివాసరావు, గంట శ్రీరామ్, ఎ.రాజు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

మీడియాపై ఉక్కుపాదాన్ని ఖండించండి : సిపిఎం

క్రూరమైన యుఎపిఎ చట్టంలోని వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, పలువురు జర్నలిస్టులు, మీడియా సంస్థల కార్యాలయాలు, స్టాండ్-అప్ కమెడియన్లు, శాస్త్రవేత్తలు, సాంస్కృతిక చరిత్రకారులు, విమర్శకుల ఇళ్లపై ఢిల్లీ పోలీసులు మంగళవారం తెల్లవారుజామున దాడులు చేయడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. న్యూస్‌క్లిక్‌పై జరిగిన దాడిని మీడియా, ప్రాథమిక హక్కు భావప్రకటనా స్వేచ్ఛపైనా జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. మోడీ ప్రభుత్వం గత తొమ్మిదేళ్లుగా బిబిసి, న్యూస్ లాండ్రీ, దైనిక్ భాస్కర్, భారత్ సమాచార్, కశ్మీర్ వాలా, వైర్ వంటి వివిధ మీడియా సంస్థలను అణచివేయడానికి, వేధించడానికి, బెదిరించడానికి దర్యాప్తు సంస్థలను సాధనాలుగా చేస్తుందని పేర్కొన్నారు. నిజాలు చెప్పే జర్నలిస్టులపై నిరంకుశంగా దాడులు చేయడం ఎంతమాత్రం సహించరానిదన్నారు. ఈ అప్రజాస్వామిక చర్యకు వ్యతిరేకంగా ప్రజాతంత్రవాదులు, మేధావులు వ్యతిరేకించాలని లోకనాథం విజ్ఞప్తి చేశారు.

బాలల హక్కులను ఉల్లంఘిస్తే ఉపేక్షించం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో బాలల హక్కుల ఉల్లంఘనలకు పాల్పడే అన్ని యాజమాన్యాల ఇంటర్మీడియట్ కళాశాలలను ఉపేక్షించబోమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, విశాఖ ఉమ్మడి జిల్లాల ఇంటర్మీడియట్ బోర్డుల సంయుక్త ఆధ్వర్యాన బాలల హక్కుల పరిరక్షణలో విశాఖ, అనకాపల్లి, ఎ ఎస్సార్ జిల్లాల ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ ఇంటర్మీడియట్ కళాశాలల ప్రిన్సిపల్ల పాత్రపై ఎవిఎన్ కళాశాలలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆర్ఐఒ రాయల సత్యనారాయణ అధ్యక్షతన సాగిన సమావేశంలో గొండు సీతారాం మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా ప్రతి నెలా రెండో శనివారం, ప్రతి ఆదివారంతో పాటు పండగలు, ప్రభుత్వం ప్రకటించిన అన్ని సెలవులు యథావిధిగా పాటించాల్సిందేనని స్పష్టంచేశారు. కొన్ని కళాశాలలు పాటించడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. సెలవుల నిబంధనలు పాటించకుంటే కళాశాలల అనుమతులు రద్దు చేయడంతో పాటు, క్రిమినల్ చర్యలు తీసుకునేలా ప్రభుత్వానికి సిఫారసులు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఎవిఎన్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.సింహాద్రి నాయుడు, జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారి శ్రీలత, వివిధ యాజమాన్యాలకు చెందిన 200 మంది కళాశాలల ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్య వారోత్సవాలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : అక్టోబర్ 10వ తేదీన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా బుధవారం నుంచి ప్రభుత్వ మానసిక వైద్యశాల, విశాఖపట్నం, విశాఖ సైకియాట్రిక్ సొసైటీ సంయుక్తంగా మానసిక ఆరోగ్య వారోత్సవాలు నిర్వహిస్తున్నాయి. ఈ వారోత్సవాలను ఎయు విసి ఆచార్య పివిజిడి.ప్రసాద్‌రెడ్డి, ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బుచ్చిరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ, శారీరక, మానసిక అలవాట్లలో మార్పుల వల్ల మానసిక అనారోగ్యానికి గురవుతున్నారని, సరైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యతను డాక్టర్ బుచ్చిరాజు వివరించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కెవి.రామిరెడ్డి మాట్లాడుతూ, ఈ ఏడాది నినాదం మానసిక ఆరోగ్యం, ఒక సార్వత్రిక మానవ హక్కు అనే అంశాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర వైద్యకళాశాల మానసిక వైద్య విభాగం ప్రధానాచార్యులు డాక్టర్ డి.విజయలక్ష్మి, డాక్టర్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ సిబ్బంది వసతి గృహాలు ప్రారంభం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విశాఖపట్నంలోని మేఘాద్రిపేట కాలనీలో తూర్పు నౌకాదళ కమాండ్‌కు చెందిన డిఫెన్స్ సివిలియన్ సిబ్బందికి వసతి భవనాన్ని తూర్పు నౌకాదళ కమాండ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా మాట్లాడుతూ, కొత్తగా నిర్మించిన ఈ 9 అంతస్తుల భవనంలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన 64 నివాస ఫ్లాట్లు ఉన్నాయని, ఇవి నగరంలోని డిఫెన్స్ సివిలియన్ ఉద్యోగుల వసతి లభ్యతలో ఉన్న కొరతను భర్తీ చేస్తాయని తెలిపారు.

బండారును ఉగ్రవాది వలే అరెస్టు చేశారు : అనిత

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తిని ఉగ్రవాదిని అరెస్ట్ చేస్తున్నట్టు 200 మంది పోలీసులు వెళ్లి లాక్కెల్లటం దారుణమని టిడిపి రాష్ట్ర మహిళా అధ్యక్షులు వంగలపూడి అనిత ఆరోపించారు. బుధవారం టిడిపి కార్యాలయంలో మీడియాతో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి రోజా అసెంబ్లీలో చంద్రబాబుపై, పలు సందర్భాల్లో పవన్ కల్యాణ్‌పై చేసిన విమర్శలు, వీడియోలు మీడియా ముందు అనిత విడుదల చేశారు. అసెంబ్లీ తనను అవమానించిన రోజా ఆ విషయం మరచిపోయారా అని ప్రశ్నించారు. అసలు ఈ అసభ్య పదజాలంలో మాట్లాడే పద్ధతికి తొలి మెట్టు వేసింది రోజా అని ఆరోపించారు. రోజాకు రాజకీయ భిక్ష పెట్టిన చంద్రబాబుపైనే ఆమె విమర్శలు చేస్తోందని ఎద్దేవాచేశారు. బండారు సత్యనారాయణమూర్తి నతీమణి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే కనీసం రసీదు ఇవ్వలేదని ఆరోపించారు. భారతిరెడ్డి గురించి ఒక్క మాట మాట్లాడితే నిమిషాల్లో పోలీసులు ఇళ్లకు వస్తారని విమర్శించారు.

బండారు క్షమాపణ చెప్పాలి : ఎమ్మెల్సీ కల్యాణి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర మంత్రి రోజా పట్ల అసభ్య పదజాలంతో మాట్లాడిన టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మహిళా లోకానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని వైసిపి ఎమ్మెల్సీ వరుదు కల్యాణి డిమాండ్ చేశారు. మహిళల పట్ల బండారు సత్యనారాయణ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా వైసిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. బండారు ఫొటోతో ఉన్న ఫ్లెక్సీని తగులబెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన మాజీ మంత్రి బండారును రాజకీయంగా బహిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పేడాడ రమణికుమారి, రోజా రాణి, పల్లా చిన్న తల్లి, మాసిన లక్ష్మి, రాధ, సుజాత, రాజేశ్వరి, యువశ్రీ, అనురాధ, సలాది భాను, లక్ష్మి, పప్పల సునీత, పలివెల ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దేవనగిరి బృంద సభ్యునికి జ్ఞాపికను అందిస్తున్న జివిఎంసి మేయర్

జివిఎంసిని సందర్శించిన దేవనగిరి కార్పొరేటర్లు

ప్రజాశక్తి-విశాఖపట్నం : కర్ణాటక రాష్ట్ర దేవనగిరి మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు బుధవారం జివిఎంసిని సందర్శించారు. జివిఎంసిలో చేపడుతున్న పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను మేయర్ గొలగాని హరి వెంకట కుమారి వారికి వివరించారు. విశాఖ కార్పొరేషన్ పరిధిలో 24 లక్షల జనాభా, 680 స్క్వేర్ చదరపు అడుగుల విస్తీర్ణంలో 8 జోన్లుగా, 98 వార్డులుగా విస్తరించి ఉందని దేవనగిరి కార్పొరేషన్ బృందానికి తెలిపారు. అనంతరం దేవనగిరి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బిహెచ్.వినాయక్ మాట్లాడుతూ, విశాఖ నగరం ఎంతో పరిశుభ్రతతో సుందరంగా కనిపిస్తుందన్నారు.

చేనేతను ఆదరించాలి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : చేనేతను ఆదరించాలని టాలీవుడ్ నటి, దామిన్ని విల్లా, లవ్ ఇన్ వైజాగ్ ఫేం రేఖ బోజ్ కోరారు. ది గేట్‌వే హోటల్‌లో వీవ్స్ అండ్ క్రాఫ్ట్స్ వస్త్ర ప్రదర్శనను బుధవారం ఆమె ప్రారంభించారు. ప్రదర్శనలోని చేనేతకారుల వస్త్రోత్పత్తులను తిలకిస్తూ, వాటి తయారీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చేనేత వస్త్రాలకు నేటికీ ఆదరణ తగ్గలేదని, నేటి తరం యువత కూడా హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను సృజనాత్మకంగా డిజైన్ చేస్తున్నారని చెప్పారు.

నిర్వాహకులు శ్రీలత ఎలమంచిలి మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ వరకూ ప్రదర్శన కొనసాగుతుందని, దేశంలోని 16 నగరాల నుంచి చేనేత కారులు, చేతి పని బృందాలు తమ సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్, పట్టు వస్త్రాలు, బెనారస్, పోచంపల్లి, చందేరి, కాశ్మీరీ సిఫాన్, చాందాని, మైసూర్ సిల్క్స్, ప్రింటెడ్ సిల్క్స్, మరో 30 నుంచి 40 రకాల వస్త్ర ఉత్పత్తులను అందుబాటులో ఉంచినట్టు వివరించారు.

వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న రేఖబోజ్ తదితరులు

క్లాక్ టవర్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నగరంలోని జగదాంబ జంక్షన్‌లో రూ.2 కోట్ల 30 లక్షల వ్యయంతో చేపట్టే క్లాక్ టవర్ నిర్మాణానికి బుధవారం జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అత్యంత ఆధునిక పద్ధతిలో నగరానికి వన్నె తెచ్చేలా స్మార్ట్ జివిఎంసి కార్యక్రమంలో భాగంగా దీనిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపి ఎంవివి సత్యనారాయణ, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, కార్పొరేటర్లు ఊరుకూటి నారాయణరావు, బిపిన్ కుమార్ జైన్, జివిఎంసి అధికారులు పాల్గొన్నారు.

క్లాక్ టవర్ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ తదితరులు

ద్రోణంరాజు శ్రీనివాస్ ఆదర్శప్రాయుడు : ఎంపీ

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : రాజకీయ నాయకులకు ద్రోణంరాజు శ్రీనివాస్ ఆదర్శనీయులని ఎంపీ ఎంవివి సత్యనారాయణ అన్నారు. మాజీ ఎమ్మెల్యే, వియంఆర్‌డిఎ మాజీ ఛైర్మన్ కీర్తిశేషులు ద్రోణంరాజు శ్రీనివాసరావు 3వ వర్ధంతిని పెద వాల్తేర్‌లోని డాక్టర్స్ కాలనీలోని ఆయన స్వగృహంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ హాజరై ద్రోణంరాజు శ్రీనివాసరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, ద్రోణంరాజు శ్రీనివాస్ సౌమ్యుడిగా పేరుగాంచారని, ఆదర్శ రాజకీయాలకు శ్రీకారం చుట్టిన వ్యక్తి అని కొనియాడారు. ద్రోణంరాజు సత్యనారాయణ వారసునిగా రాజకీయాలలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ద్రోణంరాజు శ్రీవత్సవ్, వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్ కుమార్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

KANAKADURGA
FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
విశాఖపట్నం బ్రాంచి ఆఫీసులు -
NAD కొత్తరోడ్, Opp.భాష్యం స్కూల్ రోడ్డు, గోపాలపట్నం.
-లలిత ప్లాజా, ఫస్ట్‌ఫ్లోర్, బోయ్‌లండన్ షాప్ వెనుక, ద్వారకానగర్.
- బిసి కాలనీ, బాలాజీనగర్, దుర్గమ్మ గుడిదగ్గర, అరిలోవ.
- హెరిటేజ్ సూపర్‌మార్కెట్ ఎదురు, అనకాపల్లి రోడ్డు, నర్సీపట్నం
-1st ఫ్లోర్, సీతారామనగర్, బిసి రోడ్, న్యూగాజువాక.

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-10-2023 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 1721.06 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
VIZAG AREA CELL NO- 8919239576

డ్రైనేజీలను పరిశీలిస్తున్న జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి-విశాఖపట్నం: నగరంలో పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్‌వర్మ ప్రజారోగ్యపు అధికారులను ఆదేశించారు. జివిఎంసి 37, 38, 39 వార్డుల పరిధిలోని రెల్లి వీధి, ఫిషింగ్ హార్బర్, పోర్టు రోడ్డు, పూర్ణ మార్కెట్ రోడ్డు తదితర ప్రాంతాలలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రెల్లి వీధి నుంచి దిగువరెల్లి వీధి వరకు కాలువలలో వ్యర్థాలు సరిగా తీయడం లేదని, చాలాచోట్ల చెత్త పోగులు కనిపిస్తున్నాయని, వెంటనే కాలువలు రోడ్లు శుభ్రం చేసి చెత్త పోగులు ఎత్తించాలని, కాలువలు శుభ్రం చేసిన వెంటనే ఆ ఫొటోలు కమిషనర్ కార్యాలయానికి పంపించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు.

ర్యాకుల నిర్వహణలో

గంగవరం పోర్టుఆల్‌టైం రికార్డు

ప్రజాశక్తి -గాజువాక : దేశంలోనే అత్యంత ఆధునిక ఓడరేవు అదానీ గంగవరం పోర్టు ర్యాకుల నిర్వహణలో సరికొత్త రికార్డు సృష్టించింది. గత నెలలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు విద్యుత్ పరిశ్రమలకు అత్యధికంగా160 ర్యాకుల బొగ్గును పంపి రికార్డు సృష్టించింది. ఇండియన్ పొటాష్ లిమిటెడ్ (ఐపిఎల్) కోసం మూడున్నర గంటల్లోనే 42 వ్యాగన్ల బిసిఎన్ ర్యాక్‌లను లోడ్ చేసింది. సమర్థవంతమైన కార్గో హ్యాండ్లింగ్, రైల్వే సౌకర్యాల కోసం అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం నౌకాశ్రయంలో మౌలిక సదుపాయాల కల్పనకు వ్యూహాత్మక పెట్టుబడులు పెట్టడం వల్ల మునుపటి తన రికార్డులను అధిగమించి, కొత్త రికార్డులను సాధించ గలిగింది. అత్యుత్తమ సేవలను వినియోగదారులకు అందించడం ద్వారా అదానీ గంగవరం పోర్టు తన ప్రతిష్టను మరింత పెంచుకునేందుకు కృషి చేస్తోంది.

అప్పన్నను దర్శించిన ప్రముఖులు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్నను బుధవారం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ ప్రతాపరావు జాధ్య, ఎంపీ ఫియర్ నటరాజన్, సంతోష్ పాండే దర్శించుకున్నారు వీరికి ఆలయ ఎఇఒ డి.భ్రమరాంబ, పర్యవేక్షకులు త్రిమూర్తులు ఆలయ సాంప్రదాయప్రకారం స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించగా, అధికారులు స్వామి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందించారు. బిఎస్‌ఎన్ఎల్ డిజిఎం జగదీశ్వర రావు, డిఇ రమేష్, ఎస్ఇ భగవాన్ ధర్మాన ఉన్నారు.

యువత సమాజ సేవ చేయాలి

ప్రజాశక్తి- ఆనందపురం:సమాజ సేవలో యువత భాగస్వామ్యం కావాలని వేములవలస ఉపసర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు.బుధవారం ఆనందపురం ఎగువ యాతపేటలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వర సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఎఎంసి మాజీ చైర్మన్ కోరాడ నాగభూషణరావు, ఆయన కుమారుడైన వేములవలస ఉపసర్పంచ్ కోరాడ నవీన్‌జ్ఞానేశ్వర్‌లు అన్నసమారాధనకు తమ వంతు సాయంగా రూ 30వేలను అందించారు. కార్యక్రమంలో కుప్ప గౌరి (భారత్ గ్యాస్), ముడసల శ్రీను, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాపికొండల విహార యాత్ర బోట్లు ప్రారంభం

ప్రజాశక్తి-విఆర్.పురం: ఎట్టకేలకు పాపికొండల టూరిజం బోట్లును పోచవరం బోటు పాయింట్ వద్ద బుధవారం ప్రారంభించారు. ముందుగా గోదావరి నదిలో ఉన్న బోటు షికారు వద్ద కుంకుమ పూజలు నిర్వహించారు. యూనియన్ సభ్యులు మాదిరెడ్డి సత్తిబాబు, జెడ్పీటీసీ వాళ్ళ రంగారెడ్డి, బోటు యాజమాన్యం ట్రిప్ రన్ చేసి లాంచీ యాత్రను ప్రారంభించారు.

ఎయు ఇంజనీరింగ్ విద్యార్థులకు నూతన మెస్

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు నూతనంగా ఏర్పాటుచేసిన భోజనశాలను ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి, వ్యాపారవేత్త నారాయణరెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. శివాజిపాలెంలో ఆరెంజ్ హాస్టల్‌కు అనుబంధంగా ఒకే పర్యాయం 250 మంది విద్యార్థులు కూర్చుని భోజనం చేసే విధంగా రూ.40 లక్షల వ్యయంతో మెస్‌ను అభివృద్ధి చేశారు. 20 రోజుల వ్యవధిలోనే స్టెయిన్‌లెస్ స్టీల్ బెంచీలు, నూతనంగా కిచెన్‌ను నిర్మించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మెస్‌ను ప్రారంభిస్తున్న నారాయణరెడ్డి

ట్రాఫిక్ నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన

మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎడిసిపి శ్రీనివాస్

ప్రజాశక్తి- సింహాచలం: ట్రాఫిక్ నిబంధనలను ప్రతిఒక్కరూ పాటిస్తే ప్రమాదాలకు ఆస్కారం లేకుండా సురక్షితంగా గమ్యస్థానాలను చేరుకోవచ్చని ట్రాఫిక్ ఎడిసిపి శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక స్వామి కల్యాణ మండపంలో సింహాచలంలోని టాక్సీ, ఆటో, వ్యాన్ డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రమాదాల వలన కలిగే అనర్థాలను వివరిస్తూ, పరిమిత వేగంతో, ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ, మితంగా ప్రయాణికులను ఎక్కించుకొని వాహనాలను నడిపితే ఎటువంటి ప్రమాదాలకు లేకుండా ఇంటికి చేరుకోవచ్చన్నారు. ప్రతి 40 సెకన్లకు ఒక ప్రమాదమరణం చోటుచేసుకుంటుందంటే, రోడ్డు ప్రమాదాల తీవ్రత ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చని, నష్టం జరిగిన తర్వాత బాధపడేకంటే ముందుగానే సురక్షిత ప్రయాణం అలవాటు చేసుకోవాలని, తద్వారా బీమా, ఇతర పరిహారాల కోసం ఎదురుచూసే అవసరమే ఉండదన్నారు.కార్యక్రమంలో గోపాలపట్నం ట్రాఫిక్ సిఐ అశోక్ కుమార్, ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రామకృష్ణ, డ్రైవర్లు పాల్గొన్నారు

'ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలి'పై సమీక్ష

ప్రజాశక్తి-ఆనందపురం: ఈనెల 11నుంచి నిర్వహించనున్న ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమంలో బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ పరిశీలకులు పి.బాలరాజు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు బిగ్‌స్క్రీన్‌పై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కార్యక్రమం విజయవంతానికి చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. పాదయాత్ర నుంచి అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన నాలుగున్నరేళ్లలో వైసిపి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి, తద్వారా మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలను కోరాలని సూచించారు. జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, వైసిపి మండల అధ్యక్షులు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, గన్‌రెడ్డి శ్రీను, వైస్ ఎంపిపి పాండ్రంకి శ్రీను బొట్ట రామకృష్ణ, పాండ్రంకి అప్పారావు, ఇల్లపు జగన్, రౌతు శీను పాల్గొన్నారు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

29న విశాఖలో

నార్త్ కోస్టల్ జిల్లాల యోగాసన పోటీలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నార్త్ కోస్టల్ జిల్లాల యోగాసన పోటీలను ఈ నెల 29న విశాఖపట్నంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు కె.వి.రాజు తెలిపారు. బుధవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లా యోగా సంఘం, విశాఖపట్నం యోగ విలేజ్, ఆంధ్ర యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ పోటీలు స్త్రీ, పురుషులకు వేరువేరుగా 10 గ్రూపులుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 8-11 సంవత్సరాలు, 11-14, 14-17, 17-21, 21-25, 25-30, 30-35, 35-45, 45-55, 55 ఏళ్ల పైబడిన గ్రూపులుగా ఉంటాయని పేర్కొన్నారు.

పోటీలలో పాల్గొనే ఆసక్తి ఉన్నవారు ఈ నెల 20వ తేదీలోగా పూర్తి చేసిన దరఖాస్తులను ప్రెసిడెంట్, 14-1-36, దసపల్లా హిల్స్, మహారాణిపేట, విశాఖపట్నం-530002 అడ్రస్‌కు పంపాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9866961122, 9948215863 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఒఎస్‌ఎన్‌వి. భానుకుమార్, ప్రధాన కార్యదర్శి సిహెచ్. వెంకటరమేష్, ఉపాధ్యక్షులు జి.హనుమంతరావు, కోశాధికారి జి.రమణమూర్తి పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు పందిరి రాట

ప్రజాశక్తి -మధురవాడ: టైలర్స్ కాలనీ, విజయదుర్గాదేవి ఆలయ శరన్నవరాత్రి ఉత్సవాలకు బుధవారం పందిరిరాటఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు బంగారు సుబ్బారావు, లక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ప్రధానార్చకులు శ్రీకాంత్ శర్మ శాస్త్రోక్తంగా ధర్మకర్త మండలి సభ్యులు బంగారు అశోక్ కుమార్,ర్యూన్సీ దంపతులతో పూజలు నిర్వహించి, రాట వేయించారు. ఈనెల 15 నుంచి వచ్చేనెల 24 వరకు దసరా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. కార్యక్రమంలో 7వ వార్డు వైసిపి అధ్యక్షులు పోతిన శ్రీనివాసరావు, నగరాల కార్పొరేషన్ చైర్మన్ పిళ్ళా సుజాత, సత్యన్నారాయణ దంపతులు, బంగారు ప్రకాష్, తెంటు మాధవి, నేతలు పసుపులేటి గోపి, అల్లాడ లింగేశ్వరరావు, వట్టికుల నాగమ్మ,, బెల్లాన పాపారావు, అప్పన్న పాల్గొన్నారు.

పందిరి రాటలో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు

నేరాలు ఘోరాలు

ప్రమాదవశాత్తు పడి కార్మికుడు దుర్మరణం

మృతుడు జగదీశ్వరరెడ్డి

ప్రజాశక్తి - ఆనందపురం : మండలంలోని వెల్లంకి పంచాయతీ సమీపంలో ఈగల్ ప్లైవుడ్ కంపెనీలో ప్రమాదవశాత్తు పడడంతో కార్మికుడు దుర్మరణం పాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలివి. నగరంలోని మల్కాపురం పిలకవానిపాలెం గ్రామానికి చెందిన గొంది జగదీశ్వర్‌రెడ్డి (40) వెల్లంకి ఈగల్ ప్లైవుడ్ కంపెనీలో రేకులషెడ్డు పనులు చేస్తుండగా, రేకు విరిగిపోవడంతో కిందకు పడిపోయాడు. ఈప్రమాదంలో తలకు తీవ్రగాయం కావడంతో గాయాత్రి ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు పిలకవానిపాలేనికి చెందిన చుక్క ఆదిమూర్తి, కిషోర్, మహమ్మద్ ఉస్మాన్‌తో కలిసి మృతుడు జగదీశ్ రెడ్డి గత నెల 30 నుంచి రేకులషెడ్ పనులు చేస్తున్నాడు. ఈక్రమంలో బుధవారం ఉదయం దాదాపు 9.45గంటల సమయంలో రేకు విరిగి, కిందకు పడడంతో మృత్యువాత పడ్డాడు. తోటి కార్మికులు ఇచ్చిన సమాచారం మేరకు మృతుడు అన్నయ్య సత్యనారాయణ, బంధువులు ఆసుపత్రికి చేరుకున్నారు. సత్యనారాయణ ఫిర్యాదు మేరకు ఆనందపురం ఎస్ఐ నర్సింహమూర్తి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.కాగా జగదీశ్వరరెడ్డి అవివాహితుడు.అతని తండ్రి అప్పలరెడ్డికి ఆరుగురు సంతానంకాగా, ఐదుగురు అబ్బాయిలు, ఒక అమ్మాయిలో జగదీష్‌రెడ్డి ఆఖరివాడు.

రేషన్ డీలర్‌పై కేసు నమోదు

రేషన్ డిపోలోతనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ప్రజాశక్తి-సీతమ్మధార : రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడుతున్నట్లు అందిన సమాచారం మేరకు విజిలెన్స్ అండ్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్‌పి స్వరూపారాణి ఆదేశాలతో అక్కయ్యపాలెంలోని0387014నెంబరుగల రేషన్‌డిపోపై సంబంధిత అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన తనిఖీల్లో 576కిలోల రేషన్ బియ్యం నిల్వలో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. సంబంధిత డీలర్ పి.మురళిపై '6ఎ' కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈసందర్భంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మాట్లాడుతూ, రేషన్‌బియ్యం పంపిణీ, తూకాలు, నిల్వల్లో అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.తిరుపతిరావు, పౌరసరఫరాల శాఖ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ఎఐవైఎఫ్ ప్రతినిధుల సందర్శన

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కు కర్మాగారాన్ని రాష్ట్రంలోని 26జిల్లాలకు చెందిన 40మంది ఎఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ ప్రతినిధులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ, దేశంలో సముద్రతీర ప్రాంతంలో ఉన్న ఏకైక స్టీల్ ఫ్యాక్టరీ విశాఖ ఉక్కు కర్మాగారం ఉత్పత్తి, ప్రగతిలో జాతీయ స్థాయిలో పేరు సాధించడం శుభ పరిణామమన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటైన విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు . భావితరాలకు ఇలాంటి కర్మాగారం ఎంతో అవసరమన్నారు.స్టీల్‌ప్లాంట్ సందర్శనకు సహకరించిన ఎఐటియుసి జాతీయఉపాధ్యక్షులు డి.ఆదినారాయణ,. విశాఖ జిల్లా సిపిఐ కార్యవర్గసభ్యులు క్షేత్రపాల్, ఉక్కు ఎఐటియుసి నేతలు కె. రాజబాబు, తాండ్ర కనకరాజు, జి. ఆనందలకు కృతజ్ఞతలు తెలిపారు.

విడిసిఎ ఇనిస్టిట్యూషనల్ లీగ్ క్రికెట్ టోర్నీ

సిటీ పోలీసు జట్టు ఘనవిజయం

విజయంలో కీలకపాత్ర పోషించిన బ్యాటర్ గోపీకృష్ణ, బౌలర్ శివకేశవ

ప్రజాశక్తి - పిఎం పాలెం: పిఎం.పాలెం ఎసిఎ, విడిసిఎ క్రికెట్ స్టేడియం 'బి' గ్రౌండ్‌లో విడిసిఎ నిర్వహిస్తున్న ఇనిస్టిట్యూషనల్ లీగ్ క్రికెట్ టోర్నీలో బుధవారం ఎపిఇపిడిసిఎల్ జట్టుతో జరిగిన పోటీలో సిటీ పోలీస్ క్రికెట్ జట్టు ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరిచి, 146 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. సిటీపోలీస్, ఎపిఇపిడిసిఎల్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సిటీ పోలీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 238 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎపిఇపిడిసిఎల్ జట్టు లక్ష్యచేధనలో విఫలమై, 14 ఓవర్లో 92 పరుగులకే ఆలౌటై ఓటమి పాలైంది. సిటీ పోలీసు జట్టులో వి.గోపీకృష్ణ 13 సిక్స్‌లు, ఏడు ఫోర్లుతో 123 పరుగులు చేసి తమ జట్టుకు భారీ స్కోర్ సాధించేందుకు దోహదపడ్డాడు. అదేవిధంగా కె. శివకేశవ అద్భుతమైన బౌలింగ్ చేసి 4 వికెట్లు తీసి సిటీ పోలీస్‌జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఎపిఇపిడిసిఎల్ జట్టు బౌలర్ కార్తీక్ అద్భుత ప్రదర్శన కనబరిచి నాలుగు వికెట్లు తీశాడు.

ఎయు రిజిస్ట్రార్‌గా జేమ్స్ స్టీఫెన్

ఏయూ రిజిస్ట్రార్‌గా అదనపు బాధ్యతలు స్వీకరిస్తున్న జేమ్స్ స్టీఫెన్

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చైర్, నేషనల్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అదనపు బాధ్యతలను చేపట్టారు. గురువారం ఉదయం ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి నుంచి నియామక ఉత్తర్వులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య స్టీఫెన్‌ను ఏయూ పాలక మండలి సభ్యులు, ప్రిన్సిపల్స్, విభాగాధిపతులు, ఆచార్యులు అభినందించారు.

ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ప్రస్తుతం ఏయూలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చైర్ నేషనల్ చైర్ ప్రొఫెసర్‌గా, ఏయూ ట్రాన్స్ డిసిప్లీనరీ హబ్ డీన్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఆయన 21 సంవత్సరాల సుదీర్ఘ బోధన అనుభవనాన్ని కలిగి ఉన్నారు. పది సంవత్సరాలుగా పరిపాలనా సంబంధమైన పదవులను నిర్వహించారు.

వారాహి హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీ ప్రారంభం

గ్యాస్ ఏజెన్సీని ప్రారంభిస్తున్న హెచ్‌పిసిఎల్ జనరల్ మేనేజర్

ప్రజాశక్తి-సీతమ్మధార : స్థానిక డాబాగార్డెన్స్ పవన్ ఎన్‌క్లేవ్‌లో వారాహి హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీని హెచ్‌పిసిఎల్ జనరల్ మేనేజర్ మహేష్‌రామ్, వారాహి గ్యాస్ ఏజెన్సీ యజమాని ఉషాకుమారి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌పి సిఎల్ జనరల్ మేనేజర్ మహేష్‌రామ్ మాట్లాడుతూ, ఈప్రాంతంలో అధికంగా ఉన్న హెచ్‌పి గ్యాస్ వినియోగదారులకు త్వరితగతిన మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశ్యంతోనే కొత్త గ్యాస్ ఏజెన్సీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌పిసిఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ సుందర్ వాదన్, సేల్స్ డిజిఎం మురళీకృష్ణ, ఏరియా మేనేజర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

'ఉక్కు' రక్షణ బహిరంగ సభకు తరలిరండి

నేడే కూర్మన్నపాలెంలో సభ ... సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యాన విస్తృత ప్రచారం

ఆటోజాతాను ప్రారంభిస్తున్న సిఐటియు నేత వెంకటరావు

తగరపువలస జంక్షన్‌లో మాట్లాడుతున్న మూర్తి

ప్రజాశక్తి -తగరపువలస : విశాఖ ఉక్కు రక్షణకు సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ఉత్తరాంధ్ర బైక్‌యాత్ర ముగింపు సందర్భంగా ఈనెల 5న గురువారం సాయంత్రం 4 గంటలకు కూర్మన్న పాలెం, స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద జరుగనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ ఆ పార్టీ భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం తగరపువలస జంక్షన్, ప్రైవేట్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా ఆటో ప్రచారం నిర్వహించారు. బహిరంగ సభలో సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ముఖ్య అతిథిగా పాల్గొంటారని పార్టీ జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి తెలిపారు. అధికసంఖ్యలో అన్నివర్గాల ప్రజలు పాల్గొని బహిరంగసభను విజయవంతం చేయాలని కోరారు. పార్టీ జోన్ అధ్యక్షులు రవ్వ నరసింగరావు పాల్గొన్నారు

గోపాలపట్నం : విశాఖ ఉక్కు రక్షణ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు గోపాలపట్నం జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఆటోజాతా ప్రచారాన్ని జోన్ కార్యదర్శి బలివాడ వెంకటరావు ప్రారంభించారు. పలు ప్రాంతాల్లో విస్తృతం ప్రచారం నిర్వహించి, బహిరంగ సభ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బహిరంగ సభలో సిపిఎం అఖిల భారత కార్యదర్శి సీతారాం ఏచూరి, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు ఇతర ముఖ్యనేతలు పాల్గొంటారన్నారు.

ఎంవిపి కాలనీ : కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరం వద్ద గురువారం నిర్వహించే ఉక్కు రక్షణ యాత్ర ముగింపు సభకు తరలిరావాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, ముఠా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సుబ్బారావు పిలుపునిచ్చారు. సిపిఎం మద్దిలపాలెం జోన్‌లో ముఠా కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు.

దళితుడి కాలు విరగ్గొట్టిన

పోలీసులపై కఠిన చర్యలు

కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి -అమరావతి బ్యూరో: కోళ్ల దొంగతనం పేరుతో దళితుడి కాలు విరగ్గొట్టిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఒ.నల్లప్ప, అంఁడ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో విశాఖ జిల్లా పద్మనాభం పోలీస్‌స్టేషన్‌లో బాందేవపురంలో పాపు అనే దళిత యువకుడిని కోళ్ల దొంగతనం కేసులో విచారించేందుకు స్టేషన్‌కు తీసుకొచ్చిన పోలీసులు, థర్డ్ డిగ్రీ ప్రయోగించి కాలు విరగ్గొట్టారని ఆరోపించారు. దీనికి కారణమైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

దేశంలో బిజెపి పాలిత రాష్ట్రాలతోపాటు మన రాష్ట్రంలోనూ దళితులపై దారుణమైన కుల దురహంకార దాడులు పెరుగుతున్నాయన్నారు. మాస్క్ అడిగినందుకు దళిత డాక్టర్‌ను కొట్టి చంపారని, ఇసుకపై ఫిర్యాదు చేశారని మరొక దళిత యువకుడికి శిరోముండనం చేశారని విమర్శించారు. ఘటనకు బాధ్యులైన నిందితులపైనా, కారణమైన పోలీసులపైనా ఇప్పటి వరకూ ఏలాంటి చర్యలూ తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఆందోళన, ఉద్యమాలు సందర్భంలో కొందరు పోలీసులు వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ విలువలకు చేటన్నారు. ఇప్పటికైనా పోలీసులు తీరు మార్చుకోవాలన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు కావాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలు కావాలని మాజీ ఎమ్మెల్యే, జనసేన నేత పంచకర్ల రమేష్ బాబు అన్నారు. బుధవారం అక్కయ్యపాలెం, రామకృష్ణ నగర్‌లో సంపత్‌సాయి ఉత్సవ సేవా కమిటీ ఆధ్వర్యంలో 28వ వార్షిక గణపతి ఉత్సవాల్లో భాగంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక టిడిపి కార్పొరేటర్ ముక్క శ్రావణి మాట్లాడుతూ వినాయక ఉత్సవాల్లో ప్రయోజనకర రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీని అభినందించారు. ఈ సందర్భంగా 50మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జనసేన ఉత్తర నియోజకవర్గ ఇన్‌ఛార్జి పసుపులేటి ఉషాకిరణ్, 26వ వార్డు టిడిపి అధ్యక్షులు ముక్కా కిషోర్ కుమార్, డాక్టర్ కేశవరావు, వైసిపి నేత బొడ్డేటి కిరణ్‌కుమార్, జనసేన నేత బోడసింగి శ్రీధర్,

రక్తదాన శిబిరంలో మాజీ ఎమ్మెల్యే పంచకర్ల

నాలుగో పట్టణ పోలీసు సిఐ విజయ్‌కుమార్, కోరుబిల్లి ప్రసాద్, బండి కనకరాజు, కోరుకొండ బాలాజీ, గంట సంపత్‌కుమార్, సోలా శ్రీనివాస్ పాల్గొన్నారు.

'బండారు'కు టిడిపి నేతల సంఘీభావం

బండారును కలిసిన పెందుర్తి నియోజకవర్గ టిడిపి నేతలు

ప్రజాశక్తి- పెందుర్తి : మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న అభియోగాలపై అరెస్టయి, బెయిల్‌పై విడుదలైన మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తిని బుధవారం పెందుర్తి నియోజకవర్గ పరిధిలోని పలు వార్డుల టిడిపి ముఖ్యనేతలు కలిసి సంఘీభావం తెలిపారు. విజయవాడలో బండారును కలిసిన 94వ వార్డు కార్పొరేటర్ బల్లశ్రీనివాసరావు, 97వ వార్డు టిడిపి నేత శానాపతి శంకరరావు, 95వ వార్డు టిడిపి అధ్యక్షుడు దాట్ల మధు, 96వ వార్డు టిడిపి నేత వేగి పరమేశ్వరరావు, ఇతర నాయకులు కలిశారు. ఈసందర్భంగా బండారు మాట్లాడుతూ, న్యాయం తన పక్షాన ఉంది కాబట్టే, జగన్మోహనరెడ్డి దుష్టదృష్టి నుంచి తప్పించుకున్నానన్నారు. అధినేత చంద్రబాబు కూడా కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

కరాటే విజేతలకు ఘనస్వాగతం

విజేతలను స్వాగతిస్తున్న జై జవాన్ ఫౌండేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి - ఆనందపురం: హైదరాబాద్‌లో బైలక్కీ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ టీం తరపున పాల్గొని పతకాలను సాధించిన విజేతలకు బుధవారం ఘన స్వాగతం లభించింది. జాతీయ పోటీల్లో ఆనందపురం గ్రామానికి చెందిన కుప్ప రేవంత్‌కుమార్ ఖాతా విభాగంలో గోల్డ్ మెడల్, కోమటి విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు. టి సాత్విక్ (5) కోమటి విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించాడు. కోచ్ టి సాయికుమార్ కూడా దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత టోర్నీలో పాల్గొని బంగారు పతకాన్ని, మాస్టర్ ఛాంపియన్‌షిప్‌తోపాటు రూ.పదివేల నగదు బహుమతిని సాధించాడు. గతంలో కోచ్ సాయికుమార్ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని, 16సార్లు కాంస్య పతకాలను సాధించగా, ఇపుడు గోల్డ్‌మెడల్ సాధించాడు. విజయంతో తిరిగొచ్చిన కరాటే వీరులను జై జవాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుప్పా రాజశేఖర్, కుప్పా రామలక్ష్మి, మెరుగు రాము, ఫౌండేషన్ సభ్యులు రైల్వే స్టేషన్‌కు వెళ్లి ఘనంగా స్వాగతం పలికారు. కోచ్ సాయికుమార్‌ను దుశ్శాలువాతో సత్కరించారు.

51వ వార్డులో గడపగడపకూ..

ప్రజాశక్తి - సీతమ్మధార : జివిఎంసి 51వ వార్డు మాధవదార-2 సచివాలయం, కళింగనగర్ ప్రాంతంలో స్థానిక కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, కెకె.రాజు బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. అర్హులై ఉండి పథకానికి నోచుకోకుంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమస్యలనుఅడిగి తెలుసు కున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కృష్ణారావు, జెసిఎస్ మండల ఇన్‌ఛార్జిలు అమర్ రెడ్డి, వసంతల అప్పారావు, డైరెక్టర్లు పైడి శ్రీను, దిడ్డి రమేష్, నేతలు తిరుమలరావు, పైడి ప్రతాప్, అంబటి శైలేష్, పొన్నాడ అప్పారావు, శ్యామ్, వరలక్ష్మి, రత్న, లత, గణేష్, మోహన రావు, శ్రీను, సాధు, భాను, చిన్ని, వినోద్, సీనియర్ నేతలు భోగవల్లి గోవింద్, షేక్ బాబ్జి, కె.చిన్నా, రాఘ వులు, సంతోష్, వెంకటేష్, రాము, జివిఎంసి అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం ఆపాలని నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

ప్రజాశక్తి-పెందుర్తి : 95వ వార్డు పరిధి చీమలాపల్లి రోడ్డును ఆక్రమించి చేపడుతున్న గుడి నిర్మాణాన్ని బుధవారం స్థానికులు అడ్డుకొని నిరసన చేపట్టారు. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న సిఐ శంకరన్న అక్కడికి చేరుకుని పరిస్థితిని సద్దుమణిగేలా చేశారు.

ఈ సందర్భంగా టిడిపి నేత గల్లా వెంకటరమణ మాట్లాడుతూ, అవసరం ఏదైనప్పటికీ ఎవరికివారే ఇష్టానుసారంగా రోడ్డును ఆక్రమించుకుంటూ రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. ఇప్పటికే ఆక్రమణల వల్ల చీమలాపల్లి, పొర్లపాలెం మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీనిపై అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని, తక్షణం స్పందించకుంటే కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

డి.పట్టా భూములను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలి

వి.మాడుగుల తహశీల్దారు కార్యాలయం ఎదుట ఉర్లలోవ గిరిజనుల ధర్నా - 'జగనన్నకు చెబుదాం'లో కలెక్టర్‌కు వినతి

తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉర్లలోవ గిరిజనులు

ప్రజాశక్తి-చోడవరం

వి.మాడుగుల మండలంలోని ఉర్లలోవ రెవెన్యూ పరిధిలో గిరిజనులు, పేదలకు చెందిన డి.పట్టా భూములను వెబ్ ల్యాండ్ రికార్డులో నమోదు చేయాలని, పేదలు సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలని కోరుతూ ఎపి ఆదివాసీ గిరిజన సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన బుధవారం వి.మాడుగుల తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఉర్లలోవ గ్రానైట్ క్వారీల వల్ల వ్యర్థాలు గిరిజన భూములను కప్పేస్తున్నాయని, వాటిని వాటిని వెంటనే తొలగించాలని కోరారు. ఈ మేరకు వి.మాడుగులలో బుధవారం జరిగిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. దీనికి స్పందించిన జాయింట్ కలెక్టర్ ఉర్లలోవ కొండలు సందర్శించి రిపోర్ట్ ఇవ్వాలని నర్సీపట్నం ఆర్‌డిఒను, మైన్స్ ఎడిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు కె.గోవిందరావు, ప్రధాన కార్యదర్శి ఇరట నరసింహమూర్తి మాట్లాడుతూ ఉర్లలోవలో 50 సంవత్సరాల నుండి జీడిమామిడి తోటలు వేసుకొని జీవనం సాగిస్తున్న వారు అనేక ఆందోళనలు చేసిన ఫలితంగా డి.పట్టాలు వచ్చాయని తెలిపారు. వెబ్ ల్యాండ్‌లో నమోదు కాకపోవడం వల్ల రైతు భరోసా, బ్యాంకు రుణాలు, పంట నష్ట పరిహారాలు వంటి రాయితీలు గిరిజనులకు అందడం లేదని పేర్కొన్నారు. డి పట్టా ఉండి, సాగు చేస్తున్న భూములకు జగనన్న సమగ్ర భూ సర్వేలో చేర్చి పట్టా ఉన్న సాగుదారులను గుర్తించి, వెబ్ ల్యాండ్ రికార్డులో నమోదు చేయాలని కోరారు. గ్రానైట్ క్వారీ నుండి గిరిజన భూములకు రక్షణ కల్పించాలని, నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను ఐదోవ షెడ్యూల్లో చేర్చాలని, పోడు భూములకు 314 మందికి పట్టాలు ఇవ్వాలని, పోడు భూముల సర్వే చేయాలని, ఉపాధి హామీ ద్వారా జీడి మామిడి తోటల్లో తుప్పలు తొలగించే పని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

చెక్ డ్యామ్‌ను పరిశీలించడానికి వెళ్తున్న డిప్యూటీ సిఎం, కలెక్టర్

చెక్ డ్యామ్‌ను పరిశీలించిన డిప్యూటీ సీఎం

ప్రజాశక్తి-మాడుగుల

మండలంలోని కింతలి, కింతల వల్లాపురం మీదుగా గోరిగడ్డ వద్ద నిర్మిస్తున్న చెక్ డ్యాం నిర్మాణ పనులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, జిల్లా కలెక్టర్ రవి పటాన్ శెట్టి బుధవారం పరిశీలించారు. సుమారు 12 లక్షల రూపాయలతో కేవలం రెండు నెలల కాలంలోనే పూర్తి నాణ్యత ప్రమాణాలతో ఈ పనులను పూర్తి చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కింతాలి పిహెచ్‌సికి కలెక్టరు కితాబు

కింతాలిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలోని ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో ఉన్న సమావేశ మందిరాన్ని పరిశీలించారు. సమావేశ మందిరం నమూనా ఆకర్షణం ఉందని కలెక్టర్ కితాబునిచ్చారు.

నాదెండ్ల మనోహర్‌ను సత్కరిస్తున్న రమణాజీ

జనసేనలో చేరిన రమణాజీ

ప్రజాశక్తి-చోడవరం

స్థానిక ఉషోదయ విద్యాసంస్థల ఛైర్మన్ జెర్రిపోతుల రమణాజీ జనసేన తీర్థం పుచ్చుకున్నారు. జనసేన పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి నాదెండ్ల మనోహర్ సమక్షంలో ఆయన మచిలీపట్నంలో బుధవారం ఆ పార్టీలో చేరారు. కసింకోట మండలం ఎ.ఎస్.పేట గ్రామానికి చెందిన రమణాజీ 30 ఏళ్ల క్రితం చోడవరంలో విద్యాసంస్థలు నెలకొల్పారు. అనంతరం అనకాపల్లి, దేవరాపల్లి, మాడుగుల, అచ్యుతాపురం తదితర చోట్ల విద్యాసంస్థలను నెలకొల్పి వేలాదిమంది విద్యార్థులకు విద్యను అందిస్తున్నారు. ఈ సందర్భంగా రమణాజీ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆశయాలు నచ్చి ఆ పార్టీలోకి చేరినట్లు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు.

ల్యాండ్ పూలింగ్ నిర్వాసితులకు తక్షణమే రిజిస్ట్రేషన్లు చేయాలి

నినాదాలు చేస్తున్న ల్యాండ్ పూలింగ్ నిర్వాసితులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ల్యాండ్ పూలింగ్ నిర్వాసితులకు శుక్రవారం లోపు అధికారులు మాటిచ్చిన ప్రకారం రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని లేదంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని భూ సేకరణ ల్యాండ్ పూలింగ్ నిర్వాసితుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గంటా శ్రీరామ్ హెచ్చరించారు. మండలంలోని కూండ్రం, కుంచంగి, వి.జె.పాలెం గ్రామాల ల్యాండ్ పూలింగ్ నిర్వాసితులు తమ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ 13 రోజు నుండి చేస్తున్న పోరాటానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ నిర్వాసితులకు కేటాయించిన ప్లాట్లను వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎకరాకు 20 వేల రూపాయల చొప్పున సంవత్సరానికి పరిహారం అందించాలని, అన్ని రకాల నిర్వాసితులకు ఎకరానికి 0- 36 సెంట్లు చొప్పున భూమి ఇవ్వాలని, ఉడా నిబంధనలు పాటించి వెంటనే ప్లాట్లను అభివృద్ధి చేసి అప్పగించాలని కోరారు. లేదంటే పోరాటం తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. కాయలు, పిందెలుతో ఉన్న జీడి తోటలను అర్ధంతరంగా కూలదోసిన ప్రభుత్వం నాలుగు సంవత్సరాలు అవుతున్నా నిర్వాసితులకు న్యాయం చేయకుండా మౌనం వహించారని విమర్శించారు. శుక్రవారం లోపు పరిష్కారం చేస్తామని రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చారని ఆలోపు పరిష్కారం చేయాలని లేదంటే తహశీల్దార్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కె.కొండబాబు, కె.శ్రీనువాసరావు, ఆర్.వి.కుమార్, జి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ బొడ్డేడ

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రముఖ వైద్యులు, సత్యదేవ్ హాస్పిటల్ వ్యవస్థాపకులు బొడ్డేడ లక్ష్మి నరసింహంను వైసిపి రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణ అప్పారావు తదితరులు ఆయనను బుధవారం అభినందించారు. కరోనా సమయంలో సుమారు 5000 మందికి తన వైద్య సేవలు అందించి, అతి చిన్న వయసులోనే పార్టీలో గుర్తింపు పొందిన నరసింహారావు ఆ పదవికి మరింత వన్నె తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడువాకుల నారాయణరావు, సత్యనారాయణ మాష్టారు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో హార్ట్ ఫుల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- అనకాపల్లి

గత నెల 27 నుంచి 29 వరకు బెంగళూరులో జరిగిన జాతీయ స్థాయి, కర్నూల్లో జరిగిన రాష్ట్ర స్థాయి యోగ పోటీల్లో స్థానిక హార్ట్ ఫుల్ నెస్ సెంటర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా స్థానిక రింగ్ రోడ్డు కొలపర్తి భవనంలో శ్రీరామచంద్ర మిషన్ హార్ట్ ఫుల్ నెస్ సెంటర్లో విజేతలను అభినందించారు. జాతీయస్థాయిలో ఎన్.ఆకర్ష్ ప్రథమ బహుమతి, జి గోవర్ధన్ ద్వితీయ బహుమతి, ఎన్ ప్రేమేష్, కె భావ్య, జి గోవర్ధన్ తృతీయ బహుమతి డి భవ్యశ్రీ, ఎస్ వర్షిత్ గెలుపొందారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి శాంతి గెలుపొందారు. వారికి సంస్థ తరపున కోలపర్తి జయ బాబు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో యోగా గురువులైన బొద్దపు అప్పారావు, జి మంగయ్య, రంగారావు, శ్రీనివాస రావు, త్రినాథ్ పాల్గొన్నారు.

రూ.4 కోట్లలో రైల్వే స్టేషన్ రోడ్డు విస్తరణ

ప్రజాశక్తి - యలమంచిలి

స్థానిక బస్టాండ్ వైఎస్ఆర్ విగ్రహం నుండి రైల్వే స్టేషన్ వరకు రూ.4 కోట్లతో రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ ఇంజనీర్ వీరయ్య బుధవారం తెలిపారు. అందుకోసం ఇప్పటికే తయారైన బ్లూప్రింట్‌ను వి.ఎంఆర్‌డిఎ చీఫ్ ఇంజనీర్ పి.ప్రసాదరావు పరిశీలించారు. ఆయన సూచనలు డిఇ, ఇఇ, అనుమతుల మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. అభివృద్ధి పనుల్లో కల్వర్టులు, డ్రైనేజిలు కూడా నిర్మించడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, ఛైర్‌పర్సన్ రమాకుమారి సూచనల మేరకు త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఇ సుబ్బారావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బ్లూ ప్రింట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

జెడ్‌పి వైస్ ఛైర్మన్ తుంపాలకు ఘన నివాళి

తుంపాల అప్పారావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ప్రజాశక్తి- సబ్బవరం

విశాఖ ఉమ్మడి జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ కీర్తిశేషులు తుంపాల అప్పారావు సంతాపసభ బుధవారం మండలంలోని ఎల్లుప్పి పంచాయితీ పరిధి మర్రిపాలెంలోని ఆయన స్వగ్రామంలో జరిగింది. అప్పారావు సెప్టెంబరు 10న అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు తుంపాల కుటుంబ సభ్యులు బుధవారం పెద్దకర్మ నిర్వహించి, భారీ సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పినగాడి- కె.కోటపాడు రోడ్డులోని మర్రిపాలెం జంక్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన తుంపాల అప్పారావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. తుంపాల కుటుంబానికి తమ పార్టీ అండదండలు ఎల్లవేళలా ఉంటాయని ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్ వైవి సుబ్బారెడ్డి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే అదీప్ రాజు తన సొంత లేఔట్‌లో 200 గజాలు స్థలాన్ని తుంపాల కుటుంబానికి ఇచ్చినట్లు ప్రకటించారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ జె.సుభద్ర, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు దంపతులు, ఎంపీపీ బోకం సూర్యకుమారి, రాముునాయుడు దంపతులు, పలు గ్రామాల సర్పంచ్‌లు,ఎంపీటీసీలు తుంపాల అప్పారావుకు ఘనంగా నివాళులర్పించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎల్లుప్పి సర్పంచ్ ఉగ్గిన గంగు నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చొక్కా గోవింద్, బైలపూడి భగవాన్ జయరామ్, సబ్బవరపు త్రినాథ రామకాసు, సబ్బవరపు నారాయణమూర్తి, కోటాన రాము, సబ్బవరపు ముత్యాల నాయుడు, కర్రి బాబు, వడ్డాది అప్పల రాజు, నెబర్తి శ్రీనివాసరావు, బండారు మంగ శ్రీనివాసరావు, బుదిరెడ్డ లక్ష్మీ కనకరాజు పాల్గొన్నారు.

కొండకర్ల ఆవలో ఫ్లోటింగ్ జెట్టీ ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని కొండకర్ల ఆవలో 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ఫ్లోటింగ్ జెట్టిని అనకాపల్లి ఎంపీ బీశెట్టి వెంకట సత్యవతి, ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు చేతులమీదుగా బుధవారం ప్రారంభం చేశారు. చిన్నపిల్లల పార్కును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మాజీ ఛైర్మన్ యు సుకుమార వర్మ, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్రావు, జడ్పిటిసి సభ్యుడు లాలం రాంబాబు కొన బుజ్జి సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోటింగ్ జెట్టీని ప్రారంభిస్తున్న ఎంపీ డాక్టర్ సత్యవతి

పరీక్షా పత్రాలు సరఫరా చేయకపోవడం సరికాదు

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయి

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎఫ్ఏ-2 పరీక్షలు విద్యార్థుల సామర్ధ్యాలు పరీక్షించేవిగా కాకుండా ఉపాధ్యాయుల సహనాన్ని పరీక్షించేలా ఉన్నాయని యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ఎనలేని ప్రాధాన్యత ఇచ్చి వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నట్లు చెప్పుకుంటోందని, అయితే విద్యార్థులకు నిర్వహించాల్సిన పరీక్ష ప్రశ్నాపత్రాలను ప్రింటింగ్ చేయడానికి కావలసిన నిధులు విడుదల చేయలేని నిస్సహాయ స్థితిలో ఉందని విమర్శించారు. సెల్‌ఫోన్‌లో ప్రశ్నాపత్రాలు చూసుకుని విద్యార్థులకు బోర్డుపై రాసి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించడంతో ఎక్కువ మంది విద్యార్థులున్న ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. బోర్డు మీద రాసి పిల్లలకు పరీక్షలు నిర్వహిస్తే.. ప్రభుత్వం ఇచ్చిన 45 నిమిషాలు సరిపోవన్నారు. ఇలా ప్రశ్నపత్రాలు వాట్సప్ గ్రూపుల్లో ప్రభుత్వం పంపించడం సరికాదన్నారు. ప్రశ్నాపత్రాలు ముద్రించలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉన్నప్పుడు ఎక్కడికక్కడే ఆయా పాఠశాలల్లోనే ప్రశ్నాపత్రాలు తయారు చేసుకోమని ఉపాధ్యాయులకు ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. పాఠశాలలకు రావాలసిన నిధులు ప్రభుత్వం విడుదల చేయకపోవడం వల్ల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు పేపర్లు కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్నారని, కనీసం సుద్ద ముక్కలు, తెల్ల కాగితాలు కొనడానికి కూడా నిధులు లేక పోవడం సిగ్గుచేటన్నారు. చివరికి ఉపాధ్యాయులే సొంతడబ్బులు ఖర్చు పెట్టుకుని ప్రశ్నాపత్రాలు సమాధాన పత్రాలు తీసుకువచ్చి విద్యార్థులకు ఇచ్చే దుర్భర పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయని తెలిపారు. ఇలాంటి పరీక్షా విధానం వల్ల విద్యార్థుల నుంచి ఆశించిన స్థాయిలో ఫలితాలు పొందలేమన్నారు. ఈ నెల 4వ తేదీ గడుస్తున్నా ఇంకా ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించకపోవడం మరింత దారుణమన్నారు.

8 గంటల పని విధానం అమలుచేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : గ్రామీణ తపాలా ఉద్యోగులను డిపార్ట్‌మెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, 8 గంటల పని విధానం అమలు చేయాలని, సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలని ఎఐటియుసి నాయకులు కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. బుధవారం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే దశలవారీ ఆందోళన చేపట్టినప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించలేదన్నారు. రూ.10వేలు 12 వేల చాలీచాలని జీతాలతో గ్రామీణ తపాలా ఉద్యోగులు అహర్నిశలు పని చేస్తున్నారని తెలిపారు. జీతాలు వెంటనే పెంచాలని, పెన్షన్ గ్రాట్యుటీ, ఆరోగ్య బీమా తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం జరిగే సమ్మెకు ఏఐటియూసీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. సమావేశం లో ఏఐటియూసీ నాయకులు బంటు నాగు, ఉప్పిలి ప్రవీణ్,గణేష్, ఉప్పిలి నర్సింగరావు, కోన శివ పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు నిధులు మంజూరు

ప్రజాశక్తి-మాడుగుల : కామకుంటం, కొండవీధి గ్రామాలకు చెందిన పోతురాజు బాబు, పోతురాజు స్వయం సహాయక సంఘాలకు నిధులు మంజూరు చేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈ సంఘాల సభ్యులు ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు దృష్టికి వారి సమస్యను తీసుకురాగా, మంత్రి వెంటనే స్పందించి సర్ఫ్ అధికారులు ద్వారా సమస్యను పరిష్కరించారు. పోతురాజు బాబు సంఘానికి రూ.3,42,000, పోతురాజు సంఘానికి రూ.1,89,693 మంజూరు చేశారు. ఈ చెక్కును బుధవారం మాడుగుల మండల పరిషత్ కార్యాలయంలో సహాయక సంఘాల సభ్యులకు అందజేశారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి ఉన్నారు.

45 మంది రక్తదానం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో బుధవారం మైతాన్ అల్లెన్ కంపెనీ లో నిర్వహించిన రక్తదాన కార్యక్రమంలో 45 మంది స్వచ్ఛందంగా పాల్గొని రక్త దానం చేశారు. ఈ కార్యక్రమంలో మైతాన్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ సనత్ కుమార్ దాస్, హెచ్ఆర్ ప్రసాద్ మెడికల్ ఆఫీసర్ కనకదుర్గ ప్రసాద్ వెంకటేష్ లోకేష్, భజన మండలి ప్రతినిధి కర్రి ఆది నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎ.కొత్తపల్లిలో గ్రామసభ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ఏ. కొత్తపల్లి గ్రామంలో బుధవారం సర్పంచ్ చింతల సత్య వెంకట రమణ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి సహకరించాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి పవన్, కొండలరావు, గ్రామ ఉపసర్పంచ్ పండూరి సర్వునాయుడు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పెద్దలు పాల్గొన్నారు.

ఫ్లై యాష్ లారీలను నిరోధించాలి

ప్రజాశక్తి - పరవాడ : హిందూజా పవర్ ప్లాంట్ నుంచి భారీ లారీలతో వైట్ ఫ్లైయాస్ లంకెలపాలెం ఉడుగూ జల్లుకుంటూ వెళ్తున్నాయని, వాటిని నిరోధించాలని స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయంపై వచ్చే సోమవారం స్పందనలో స్థానిక వ్యాపారులతో ఫిర్యాదు చేయిస్తానని, దానికి కూడా స్పందించకపోతే ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఫ్లైయాస్ వల్ల స్థానిక వ్యాపారులు పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, అనారోగ్య పాలవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే పొల్యూషన్, ఆర్టిఓ అధికారులు చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మితాహారంతో మంచి ఆరోగ్యం

ప్రజాశక్తి- అనకాపల్లి : మంచి ఆరోగ్యానికి మితాహారం దివ్య ఔషధమని కేజీహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్ఆర్ఎస్ గిరిధర్ పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అనకాపల్లి జిల్లా ఆత్మీయ కలయిక సమావేశం బుధవారం స్థానిక వివేకానంద హాల్లో నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా కెజిహెచ్ గ్యాస్ట్రాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్ఆర్ఎస్.గిరిధర్, డాక్టర్ విక్రమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్యాస్ట్రిక్ ,లివర్, జాండిస్, పేగు ఒరుపు మొదలగు వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ప్రెసిడెంట్ ఆడారి శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ కోరుకొండ వీరభద్రరావు, సెక్రటరీ ఈ ఈశ్వరరావు, జోనల్ వైస్ ప్రెసిడెంట్, డివిజన్ సెక్రటరీ అల్లక రాజు, గౌరవ సలహాదారు కే.వి.ఎస్.ఎస్ రాజు, మారోజు సత్యనారాయణ, జోనల్ మీడియా కోఆర్డినేటర్ వై.వి. రమణాజీ, శ్రీనివాస్ ప్రచార కారదర్శి రాజు, ఎ.శ్రీకాంత్ గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

బోనాలతో టిడిపి వినూత్న నిరసన

బోనాలతో ప్రదర్శన చేస్తున్న టిడిపి నాయకులు, మహిళలు

ప్రజాశక్తి - అచ్యుతాపురం

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టు నిరసిస్తూ బుధవారం అచ్యుతాపురం జంక్షన్‌లో మహిళలు బోనాలతో వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. రెండు కిలోమీటర్లు వరకు నడుచుకుంటూ ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అలాగే అచ్యుతాపురం జంక్షన్‌లో నిరాహార దీక్షలు కొనసాగించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పప్పుల చలపతిరావు, జెడ్‌పి మాజీ చైర్‌పర్సన్ లాలం భవాని, ఆ పార్టీ నాయకులు బుద్ధ నాగ జగదీష్, ప్రగడ నాగేశ్వరరావు, ఆడారి మంజు, భీమరశెట్టి శ్రీనివాసరావు, జనపరెడ్డి నరసింగరావు, లాలం రాజు, మెరుగు బాపు నాయుడు, జనసేన నాయకులు బి.రాందాస్, ఎం త్రివేణి పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా మండలంలోని సీతయ్యపేటలో రిలే నిరాహార దీక్షలు బుధవారం చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు, నాయకులు గోకివాడ కోటేశ్వరరావు, స్థానిక సర్పంచ్ వజ్రపు శ్రీను, డొంకిన అప్పలనాయుడు కోరుకొండ రవికుమార్, రూతల రాము, పలు గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ 36వ వార్డు పరిధి ఎవిఎన్ కాలేజీ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద 'మేము సైతం' అంటూ సామూహిక రిలే నిరాహారదీక్ష కార్యక్రమం నిర్వహించారు. తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గండి బాబ్జి, నాయకులు కల్వేపల్లి గణపతి, కేదారి లక్ష్మి, ఈశ్వరరావు, శివయ్య, భద్రరావు, రామారెడ్డి, బంగారు రవిశంకర్, కె.చిన్న తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్: మండలంలోని ధర్మసాగరం గ్రామానికి చెందిన మహిళలు తీర్థయాత్రలు చేస్తూ చంద్రబాబు అరెస్టుపై షిరిడీ, శనిశింగనాపూర్, విజయవాడ దుర్గా మాత ఆలయాల వద్ద జడ్డిటిని సుకల రమణమ్మ ఆధ్వర్యంలో ఆందోళన వ్యక్తం చేశారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చంద్రబాబు గ్రామాలను ఎంతో అభివృద్ధి చేశారని, యువతకు వృత్తి విద్యా శిక్షణను అందించి ఎంతోమందికి ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. ఆయనను అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో ధర్మసాగరం వైస్ సర్పంచ్ భీమిరెడ్డి లక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

గోపాలపట్నం : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా 52వ వార్డు ఎన్ఎడి కొత్తరోడ్‌లో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యంతో 'బాబుతోనేను'లో భాగంగా సంఘీభావంగా సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో టిడిపికార్పొరేటర్లు బొమ్మిడి రమణ,శరగడం రాజశేఖర్, నేతలు వాసుదేవరావు, వి. చంద్రశేఖర్ మహంతి (చందు), పాల శ్రీను, పొలమరశెట్టి శ్రీనివాసరావు, పెంటకోట అజయ్, పొట్నూరు అప్పారావు, శరత్ చంద్ర, బలభద్ర రాజు, నరవ అనూష, సందు, యలమంచిలి ప్రసాద్, నరవ పైడిరాజు, ఈశ్వరరావు, వేణుమాధవ్, రాధ పాల్గొన్నారు.

అన్న సమారాధన ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ కర్రి బాబి

భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల వెంకుపాలెం రోడ్డులో శ్రీ సిద్ధి వినాయక రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్, అన్నపూర్ణ పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కర్రి వెంకట సన్యాసినాయుడు (బాబి), నడిపల్లి గణేష్ ప్రారంభించారు. ముందుగా ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారిని సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసింది. ఈ కార్యక్రమంలో నడిపల్లి బోసు బాబు, మార్టూరు అజయ్, బుదిరెడ్డి సూరిబాబు, గొంతిన గంగాజలం, గొంతిన శ్రీనివాసరావు, మార్టూరు జగ్గారావు, శిరసపల్లి చిట్టిబాబు, శిరసపల్లి అప్పలరాజు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి ఆలయం హుండీ చోరీ

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని మారేపల్లి సమీపంలో ఉన్న కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉన్న హుండీ చోరీకి గురైందని ఆలయ ధర్మకర్త అవుగడ్డ రామ్మూర్తి నాయుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ప్రతిరోజు ధూప దీప నైవేద్యం కొరకు ఆలయ అర్చకులు చిట్లా వర్ధుల నర్సింగరావు బుధవారం ఉదయం ఆలయం దగ్గరికి వెళ్లేసరికి ఆలయం ముందు తలుపుకుండే తాళం పగలగొట్టి ఉంది. హుండీ గుడి వెనుక భాగంలో ఉన్న ఇసుక కప్పుపైకి తీసుకువెళ్లి తాళం కప్పలు పగలగొట్టినట్లు ఉండటం చూసి వెంటనే మారేపల్లి గ్రామ పెద్దలకు ఫోన్ ద్వారా సమాచారం తెలియజేశారు. ఆ వెను వెంటనే రామ్మూర్తి నాయుడుతో పాటు గ్రామ పెద్దలు స్థానిక పోలీస్ స్టేషన్కు తెలియజేశారు. స్థానిక ఎస్సై డి నాగేంద్ర తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ఆలయంలో ఉన్న హుండీ ఎలా చోరీకి గురైందో పరిశీలించారు.

నేడు నర్సింగబిల్లిలో లేగదూడల ప్రదర్శన

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని నరిశింగబిల్లి గ్రామంలో పశుసంవర్థక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా మేలు జాతి లేగ దూడల అందాల ప్రదర్శనను గురువారం నిర్వహించనున్నట్లు పశువైద్య అధికారి డాక్టర్ చైతన్యమణి బుధవారం తెలిపారు. ఆసక్తి గల రైతులు తమ తమ లేగ దూడలను తీసుకురావాలని కోరారు. ప్రదర్శనలో పాల్గొనడానికి తెచ్చిన అన్ని లేగ దూడలకు ఆయా రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తారని తెలిపారు.

సిహెచ్‌సిని సందర్శించిన జనసేన నేత

ప్రజాశక్తి-చోడవరం : పట్టణంలోని 30 పడకల ఆసుపత్రిని జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ పివిఎస్ఎన్ రాజు బుధవారం సందర్శించారు. అక్కడ ఉన్న వైద్యాధికారులు, రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రంగా ఉన్న ఈ ఆసుపత్రిలో సౌకర్యాలు లేవన్నారు. మార్చురి రూము పూర్తిగా శిథిలమైందన్నారు. ఆసుపత్రిలో జనరేటర్ లేకపోవడం వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు జనసేన మండల నాయకులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలి

జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి

సమావేశంలో పాల్గొన్న జెసి, రాజకీయ పార్టీల ప్రతినిధులు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారు చేసేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి కోరారు. జెసి చాంబర్లో బుధవారం జరిగిన సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె మాట్లాడుతూ ఈ వారం రోజులలో కొత్తగా నమోదు, అభ్యంతరాలు, సవరణలు కలిపి (ఫారం 6,7,8 లు) 1148 అందాయని చెప్పారు. ఇప్పటివరకు అందిన అభ్యర్థనలను పరిశీలించి నమోదు, తొలగింపులు దాదాపుగా పూర్తి చేశామన్నారు. మరణించిన ఓటర్లను కూడా గుర్తించి తొలగింపులు చేశామన్నారు. సరియైన డాక్యుమెంట్లు లేనందున ఇంకా కొన్ని పెండింగ్‌లో ఉంచడం జరిగిందన్నారు. ప్రదేశం మారిన వారిని కూడా దాదాపుగా మార్పు చేసినట్లు చెప్పారు. సవరణలన్నీ ఈఆర్వోల నెట్‌లో ఉంచడం జరిగిందన్నారు. ఈనెల 16వ తేదీ నుండి ఎల్రక్టానిక్ ఓటింగ్ మిషన్ల ఫైనల్ లెవెల్ చెకింగ్ జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన గొర్లె సూరిబాబు (వైసిపి), సి హెచ్.నాగేశ్వరరావు (బిజెపి), డి.సతీష్ (కాంగ్రెస్), ఎస్.వి.వి. రామచంద్ర రావు (బీఎస్పీ), ఆర్.శంకర్రావు (సిపిఎం), ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ లక్ష్మీదేవి, డి.టి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే బాబూరావు

ప్రజాశక్తి-నక్కపల్లి:అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. నక్కపల్లిలో బుధవారం గడపగడపకు కార్యక్రమం నిర్వహించారు.ఎస్సీ కాలనీ, అవ్వారి వీధి తదితర ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గడపగడపకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు.ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అర్హులందరికీ సంక్షేమ ఫలాలను ప్రతి గడపకు చేరవేస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలనుంటిని అమలు చేసిన ఘనత ఒక్క జగన్మోహన్ రెడ్డి కే దక్కుతుందని కొనియాడారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు.అర్హులై ఉండి సంక్షేమ పథకాలు పొందలేని వారిని గుర్తించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ప్రతి పేదవానికి మెరుగైన వైద్యం అందించాలని లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యం అందించడం జరుగుతుందని తెలిపారు. ఇల్లు, ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని పలువురు లబ్ధిదారులు వినతి పత్రాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రత్నం, సర్పంచ్ జయ రత్నకుమారి, వైస్ ఎంపీపీ నానాజీ, వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, నక్కపల్లి పిఏసిఎస్ పర్సన్ ఇన్చార్జి ఎలమంచిలి తాతబాబు, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, శేషారత్నం, సూరకాసుల గోవింద్, బాబూరావు, నల్లల రామకృష్ణ, ఏవో సీతారామరాజు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పథకాల బుక్‌లెట్ ఇస్తున్న ఎమ్మెల్యే

మాట్లాడుతున్న ఎంవిఆర్ ట్రస్టు సభ్యులు

ఎంవిఆర్ సేవలపై ప్రచారం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:అనకాపల్లికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) సేవలపై నర్సీపట్నం నియోజక వర్గంలో ప్రచారాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం గుర్రంధొరపాలెం తదితర ప్రాంతాల్లో ఎంవిఆర్ సేవా ట్రస్ట్ సభ్యులు, నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జి నానాజీ, సూర్య తదితరులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నగరం, గుర్రంధరపాలెం గ్రామ ప్రజలు తీర్థయాత్రలకు వెళ్లేందుకు వాహనాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొన్ని సేవా కార్యక్రమాలు ఈ ప్రాంతంలో చేయనున్నట్లు ప్రకటించారు. నర్సీపట్నం నియోజకవర్గంలోని నర్సీపట్నం, గొలుగొండ, మాకవరపాలెం, నాతవరం మండలాల్లో సేవా కార్యక్రమాలు విస్తరించేందుకు పర్యటి స్తున్నామన్నారు.

దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి -చీడికాడ :మండల కేంద్రంలో కాంగ్రెస్ నేత, కీర్తిశేషులు బి. మోదినాయుడు 16వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు బొడ్డు శ్రీనివాసరావు, రామకృష్ణ. అప్పలనాయుడులు పారిశుధ్య కార్మికులకు, వృద్ధులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నన్నయ్య యూనివర్సిటీ మాజీ ఆచార్యులు ముద్ర ముత్యాలనాయుడు మాట్లాడుతూ, మోది నాయుడు కాంగ్రెస్ పార్టీలో అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎర్ర అప్పారావు, బొడ్డు శ్రీనివాసరావు, దాసు, మాలక్ష్మి నాయుడు, రామకృష్ణ పాల్గొన్నారు.

దుస్తులు ఇస్తున్న కుటుంబీకులు

మీగడకు గంటా పరామర్శ

ప్రజాశక్తి- నక్కపల్లి:నక్కపల్లికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు మీగడ సత్తిబాబును బుధవారం నక్కపల్లిలో ఆయన స్వగృహంలో ు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే సింహాచలం, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మీ శివకుమారి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ తోట నగేష్, జనసేన నాయకులు గెడ్డం బుజ్జి తదితరులు పరామర్శించారు. మీగడ సత్తిబాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి విశాఖలో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు.ప్రస్తుతం ఆయన నక్కపల్లిలో తన స్వగృహమునందు కోలుకుం టున్నారు. ఈ మేరకు ఆయనను పరామర్శించి ,ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో జిల్లా పరిషత్ కో ఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు కురందాసు నూకరాజు, బాబ్జిరాజు, కొప్పిశెట్టి బుజ్జి, కర్రి వెంకట సత్యనారాయణ , మెరుగు నాగేశ్వరరావు, బాబులు ఉన్నారు .

పరామర్శిస్తున్న గంటా , నేతలు

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-గొలుగొండ:జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.వి.సత్యనారాయణరావు (నర్సీపట్నం) , కార్యదర్శిగా అంబటి వరహాలరాజు (కృష్ణదేవిపేట), కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎన్. సీతారామయ్య (కాకరపాడు), కార్యవర్గ సభ్యులుగా పంచాడ వెంకటరమణ, లగుడు చిన్నబాబులు (కృష్ణదేవిపేట) ఎన్నికైనట్లు జాతీయ అల్లూరి సీతారామరాజు వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు తెలియజేశారు. గాంధీ జయంతి రోజున అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగలలో సంఘం జాతీయ మహాసభ జరిగిందని, అందులో 60 మందిని నూతన కార్యవర్గంగా ప్రకటించడం, ఆ కార్యవర్గంలో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని వీరభద్రరావు తెలిపారు.

మాట్లాడుతున్న తహశీల్దార్

స్పందన ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల వ్యాప్తంగా ప్రధానంగా రెవెన్యూ సమస్యలపై స్పందనలో వచ్చిన ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం చేయరాదని తహసిల్దార్ సోమశేఖర్ సూచించారు. బుధవారం ఆయన గ్రామ రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల వారిగా స్పందన వినతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్పందనలో వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. భూములకు హక్కు కల్పించే విషయంలో అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ప్రధానంగా అత్యధికంగా వందూరు, రెవెన్యూ పరిధిలో భూముల పట్ల ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నందున ప్రత్యేక దృష్టి సారించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఉర్దవరావు, సర్వేయర్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ గణపతి రావు వీఆర్వోలు పాల్గొన్నారు.

రోడ్డుపై గోతులు పూడ్చివేత

ప్రజాశక్తి-రోలుగుంట:మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయం కూడలి వద్ద ఆర్అండ్‌బి రోడ్డు గోతులను జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్చార్జ్ పివి ఎస్ఎన్.రాజు ఆధ్వర్యం లో గ్రావెల్ వేసి పూడ్చారు. ఈ గోతులు పూడ్చడంతో రోడ్డుపై ప్రయాణం చేసే వారంతా హర్షం వ్యక్తం చేశారు.

గోతులు పూడ్చివేయిస్తున్న రాజు

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు వైద్యం

ప్రజాశక్తి -కోటవురట్ల:జగనన్న ఆరోగ్య సురక్షతో పేద ప్రజలకు ప్రభుత్వం వైద్యం అందిస్తున్నదని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ బాలికల పాఠశాల వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 250 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, తహసిల్దారు సోమశేఖర్, వైస్ ఎంపీపీ దత్తుడు రాజు, ఈఓపిఆర్డి సుబ్రహ్మణ్యం, ఆరోగ్య విస్తరణ అధికారి గోవిందరావు పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలోని పెదతీనార్ల గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరానికి వచ్చిన రోగులను వైద్యాధికారులు పరీక్షల నిర్వహించి మందులను అందజేశారు. తహసీల్దార్ అంబేద్కర్, ఎంపిడిఓ శ్రీనివాసరావు, సర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు నాగేశ్వరరావు పరిశీలించారు.

ఎస్.రాయవరం:లింగరాజుపాలెం గ్రామ సచివాలయ ప్రాంగణం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. మండలంలో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి లింగరాజుపాలెం గ్రామ సచివాలయం ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమన్ని గ్రామ సర్పంచ్ ఉదయ కుమారి ప్రారంభించారు. మండల రెవెన్యూ అధికారి విజయ కుమార్, మండల విద్యాశాఖ అధికారి మూర్తి పాల్గొన్నారు.

గొలుగొండ:ప్రజల చెంతకే వైద్య సేవలు అందుతున్నాయని ఎంపిపి గజ్జలపు మణికుమారి అన్నారు. కృష్ణదేవిపేట గ్రామంలో సర్పంచ్ పందిరి సత్యనారాయణ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైసిపి సీనియర్ నాయకులు పసగడుగుల గిరిబాబు, ఉప సర్పంచ్ దుంపలపూడి సహదేవుడు, ఎంపిడిఒ డేవిడ్‌రాజు వైద్యాధికారులు హరిప్రవీణ్, గాయత్రి పాల్గొన్నారు.

రావికమతం: మేడివాడ గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. పిహెచ్ వైద్యులు దుర్గాప్రసాద్ వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఎంపీడీవో వెంకన్న బాబు, ఎంపీటీసీ సత్య ప్రసాదు, సచివాలయ కన్వీనర్ ధనాజీ, కోపరేటివ్ అధ్యక్షులు కోటి పాల్గొన్నారు.

మేడివాడలో మాట్లాడుతున్న వైద్యులు

పిసినకాడలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

రోలుగుంట:మండలంలోని రత్నంపేట జగనన్న ఆరోగ్య సురక్షలో మందులు పంపిణీ చేశారు. వైసిపి మండల నాయకులు రాజారావు, గ్రామ మాజీ సర్పంచ్ తమటపు సత్యంనాయుడు, కోపరేటివ్ డైరెక్టర్ ఎర్రంశెట్టి అప్పలనాయుడు(బాబూరావు), రమణాజీ పాల్గొన్నారు.

కశింకోట : ఉగ్గినపాలెంలో వైయస్సార్ హెల్త్ క్లినిక్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి హేమంత్ గురువారం సందర్శించారు. ఆరోగ్య సురక్ష కార్డులను వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి లగా లక్ష్మి గున్నయ్య నాయుడు, వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు, మలసాల కిషోర్, గొల్లివిల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యలమంచిలి : జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే యువి .రమణమూర్తి రాజు అన్నారు. ఎంపిపి గోవిందరావు, సుకుమారవర్మ, కొల్లి త్రినాథ్, సంధ్యారాము, ఎంపిడిఒ అప్పలనాయుడు, ఎమ్మార్వో రాణి అమ్మాజీ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మండలంలోని ఉప్పవరం గ్రామ సచివాలయం పరిధిలో ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు ప్రారంభించారు. కార్యక్రమంలో యు.సుకుమార్ వర్మ, మల్లవరం సర్పంచ్ పి వాసురాజు, దేశంశెట్టి శంకర్రావు, కోన బుజ్జి, నర్మదా కుమార్, లాలము రాంబాబు పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలోని పిసినకాడ గ్రామ సచివాలయంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జెడిపి వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరహ సత్యవతి, ఎంపిపి గొర్లి సూరిబాబు సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో డిఎంహెచ్‌ఓ డాక్టర్ హేమంత్, ఎంపీడీవో నరసింహారావు, తహశీల్దారు గంగాధర్‌రావు, సర్పంచ్ యల్లపు రమేష్, దాడి రాము, ఎంపీటీసీ హైమశివాజీ తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని కొత్తపెంట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జెడ్పీటీసీ కర్రి సత్యం, స్థానిక సర్పంచ్ రొంగలి వెంకటరావు (నీలిమ) బుధవారం ప్రారంభించారు. స్పెషలిస్ట్ వైద్యులు జాన్, కళ్యాణి, వేచలం, దేవరాపల్లి పీహెచ్సీ వైద్యులు బి.హారిక, ఎస్.లలిత 368 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ, మాజీ సర్పంచ్ రొంగలి వెంకటరావు, సిరికి శంకర్రావు పాల్గొన్నారు.

ఆనందపురం: మండలం గొట్టిపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొని వైద్యసేవలను పర్యవేక్షించారు. సర్పంచ్ గంటా జగదీష్, ఇల్లాపు వెంకట జగన్, ప్రోగ్రాం అధికారి పద్మ, డాక్టర్ ఎం.గంగునాయుడు, సామాజిక వైద్యులు సాంబమూర్తి, జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షులు బంక సత్యం, మజ్జి వెంకటరావు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక జివిఎంసి పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా 170 మంది విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. పాఠశాల హెచ్ఎం సిహెచ్ సింహాచలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతమ్మధార : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని విశాఖ ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కెకె రాజు అన్నారు. 48వ వార్డు బర్మా క్యాంపులోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడారు. జివిఎంసి జోనల్ కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, వార్డు వైసిపి ఇన్‌ఛార్జి నీలి రవి, ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు కంటిపాము కామేశ్వరి, 14వవార్డు కార్పొరేటర్ కె.అనిల్ కుమార్‌రాజు, కోఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, మండల అధ్యక్షులు జివి రమణి, జెసిఎస్ మండల కన్వీనర్ వసంతల అప్పారావు, రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత, వార్డు అధ్యక్షులు పీలా వెంకటలక్ష్మి, భోగవల్లి గోవింద్, జివిఎంసి అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

కిట్లు ఇస్తున్న కెకె రాజు

రక్తదానం చేస్తున్న యువకులు

మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: స్థానిక రిషి డిగ్రీ కళాశాలలో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ . ఏ.గోపాలరావు, ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ డి.రాఘవేంద్రరావు, ఎస్‌టిఓ రామారావు, కళాశాల కరస్పాండెంట్ కె.సతీష్, లైన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ, రక్త దానం చేయడంతో ఆరోగ్యం బాగుంటుందన్నారు. ప్రమాదంలో ఉన్న రోగులకు ప్రాణ భిక్ష పెట్టినట్టు అవుతుందని గోపాలరావు తెలిపారు. సుమారు 90 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు కరస్పాండెంట్ సతీష్ తెలిపారు.

అభినందిస్తున్న ఉపాధ్యాయులు

క్రీడాకారులకు అభినందనలు

ప్రజాశక్తి -కొత్తకోట: రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలలో ప్రతిభ చూపి ఉమ్మడి విశాఖ జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలిపిన టి.అర్జాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులను బుధవారం పలువురు అభినందించారు. బాల్ బాడ్మింటన్ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీలు కర్నూలు జిల్లా మహానందిలో సెప్టెంబరు 30, అక్టోబరు 1,2 తేదీలలో జరిగాయి. ఈ పోటీలలో పాఠశాలకు చెందిన మత్సభాగ్య, మలిచెట్ల భీష్మనందిని పోటీలలో అత్యంత ప్రతిభ కనబర్చి ఉమ్మడి విశాఖ జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలిపారు. బుధవారం పాఠశాలకు వచ్చిన వారిద్దరినీ ఆ పాఠశాల కమిటీ చైర్మన్ ఎం. శివయ్యనాయుడు, హెచ్‌ఎం ఎంకె ఆర్‌ఎస్ నాయుడు, పిడి రమేష్ నాయుడు, సిఆర్‌ఎం టి. గుంటూరు రామారావు, ఉపాధ్యాయులు జిపిఎస్ నాయుడు తదితరులు అభినందించారు.

నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

పోస్టల్ ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏఎల్‌పురం పోస్ట్ ఆఫీస్ వద్ద ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ పిలుపు మేరకు 18 బ్రాంచీల పోస్టల్ ఉద్యోగులు ఒక్క రోజు సమ్మె చేపట్టారు. 8 గంటల పనిదినం, పెన్షన్ అమలు చేయాలని, గ్రూపు ఇన్స్ రెన్స్ రూ.5లక్షలు సౌకర్యాలు కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 18 బ్రాంచుల ఉద్యోగులు, యూనియన్ నాయకులు ప్రసాద్, పైల కృష్ణ, గవరరాజు, చినబ్బాయి, అంబటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలో నూతనంగా నిర్మించిన కురిడి పంచాయతీ సచివాలయ భవనాన్ని బుధవారం స్థానిక అరకు ఎమ్మెల్యే పాల్గుణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, ప్రజలకు సుపరిపాలన అందించ డమే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిందన్నారు.

ప్రజల ఆకాంక్షకు అద్దంపట్టిన ఉక్కు రక్షణ యాత్ర

-ఉత్తరాంధ్రలో విశేష ఆదరణ
-ప్రజల్లో పెరుగుతున్న పట్టుదల
-స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై ప్రతిఘటనకు సంసిద్ధత
-ప్రజాశక్తితో బైక్‌యాత్ర రథసారథి,
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

'ఉత్తరాంధ్రలో 12 రోజులపాటు చేపట్టిన విశాఖ ఉక్కు రక్షణ బైక్ యాత్ర విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రక్షించుకోగలమన్న విశ్వాసం పెంచింది. మేధావులు, ఉద్యోగులు, యువత, విద్యార్థులు, రైతులు వివిధ తరగతుల ప్రజలు ఉద్యమానికి మద్దతు తెలిపారు. సెప్టెంబరు 20న జివిఎంసి గాంధీ విగ్రహం దగ్గర ప్రారంభమైన బైక్ యాత్ర విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు (పాడేరు డివిజన్), అనకాపల్లి జిల్లాల్లోని పలు ప్రాంతాల మీదుగా 1500 కిలోమీటర్లు సాగి అక్టోబర్ ఒకటిన పెందుర్తిలో ముగిసింది. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు మోడీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టేందుకు ఉత్తరాంధ్ర ప్రజలను పోరాటాలకు సన్నద్ధం చేయాలన్న బైక్ యాత్ర ప్రాథమిక లక్ష్యం నెరవేరింది. పోరాడి సాధించుకున్న ఉక్కు ఫ్యాక్టరీని పోరాటాలతో నిలబెట్టుకోవాలన్న పట్టుదల ప్రజల నుంచి వ్యక్తమైంది' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, బైక్ యాత్రకు నాయకత్వం వహించిన కె.లోకనాథం ప్రజాశక్తికి తెలిపారు. గురువారం స్టీల్‌ప్లాంట్ ఆర్చ్‌వద్ద జరగనున్న ఉక్కు రక్షణ యాత్ర బహిరంగ సభ సందర్భంగా బైక్ ర్యాలీ అనుభవాలను, ప్రజా స్పందన వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

12 రోజుల బైక్ యాత్ర ఎలా సాగింది?

స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ ప్రమాదం నుంచి కాపాడుకోవాలన్న సంకల్పంతో సాగిన బైక్ యాత్ర ఎంతో ఉత్సాహాన్ని, స్ఫూర్తినిచ్చింది. పట్టుదల పెంచింది. ఆరు జిల్లాల్లో 1500 కిలోమీటర్లలో సాగిన బైక్ యాత్ర సందర్భంగా 150కిపైగా సభలు జరిగాయి. స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవాలన్న కసి ప్రజల్లో కన్పించింది. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ పట్ల వైసిపి, టిడిపి, జనసేన అవకాశవాద వైఖరిని వివరించాం.

ప్రజల స్పందన ఎలా ఉంది

ప్రజల సొమ్ముతో నిర్మించిన స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాలని ప్రజలకు వివరించినప్పుడు, విశేషమైన స్పందన లభించింది. 'బాబూ మీరు వదలకుండా పోరాడండి, మీ వెంట మేముంటామంటూ రైతులు, వివిధ తరగతుల ప్రజలు మద్దతు తెలిపారు. విద్యార్థులు, యువత బైక్‌యాత్రలో భాగస్వాములయ్యారు.

యాత్ర అనుభవాలు చెబుతారా?

ఉదయం ఆరు గంటలకు ప్రారంభమైన బైక్‌యాత్ర రాత్రి 9.30 గంటల వరకు కొనసాగినప్పుడు ఎటువంటి అలసటా కన్పించలేదు. ఒక్క రోజే విరామంలేకుండా 203 కిలోమీటర్లు బైక్‌యాత్ర జరిగింది. వర్షాలు, ఎండను తట్టుకొని 62 మంది యాత్ర బృంద సభ్యులు చివరి వరకు పాల్గొన్నారు. ఒక రోజు బైక్‌యాత్రలో పాల్గొనాలని వచ్చిన వారు తమ సొంత పనులు పక్కనబెట్టి 12 రోజుల పాటు కొనసాగారు. సిపిఎం చేపట్టిన స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ బైక్ యాత్ర ఉత్తరాంధ్రలో చర్చనీయాంశమైంది. ప్రజలు ఆదరించారు. స్వచ్ఛందంగా భోజనాలు పెట్టడంతోపాటు రాత్రిపూట వసతి కల్పించారు. బృంద సభ్యులకు జ్వరం, జలుబు, తలనొప్పి వంటివి వచ్చినా లెక్కచేయలేదు. వెనుకడుగు వేయలేదు. ప్రజానాట్యమండలి కళాకరుల పాటలు, ప్రదర్శనలు ఆలోచింపజేశాయి.

పరిశ్రమల్లో ప్రచారం ఎలా జరిగింది?

స్టీల్‌ప్లాంట్, హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్, కోరమాండల్ కంపెనీ గేట్ వద్ద సభలు నిర్వహించాం. ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలను మోడీ ప్రభుత్వం ఎలా ధ్వంసం చేస్తుందో వివరించాం. స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించకుండా, దివాళాతీయడానికి చేస్తున్న కుట్రలను తెలియజేశాం. పోరాడకపోతే ప్రభుత్వరంగ సంస్థలను నిలబెట్టుకోలేమన్న అభిప్రాయం కార్మికులు, ఉద్యోగుల్లో వ్యక్తమైంది.

యాత్రలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల భాగస్వామ్యం వివరిస్తారా

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు తమ సొంత ప్రాంతాలకు వెళ్లి బైక్‌యాత్రలో భాగస్వాములయ్యారు. గ్రామాల్లో ప్రచారం చేసి ప్రజలను సమీకరించి మద్దతుగా వచ్చారు. స్టీల్‌ప్లాంట్‌లో పర్మినెంట్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉత్తరాంధ్ర వ్యాపితంగా ఉన్నారు. ఉపాధి కల్పించే ప్లాంట్‌ను పోగొట్టుకోకూడదన్న బలమైన అభిప్రాయంతో ఉద్యోగులు, వారి కుటుంబాలున్నాయి. ప్రయివేటీకరిస్తే ఉద్యోగాల భర్తీలో రిజర్వేషన్లు ఉండవన్న ఆందోళన ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ తరగతుల్లో కన్పించింది. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటం ఉత్తరాంధ్రలో బలపడుతుంది.

నర్సీపట్నం రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: గత 8 మాసాలుగా అనేక మలుపులు తిరిగిన నర్సీపట్నం ప్రధాన రోడ్డు విస్తరణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ డ్రైనేజీ పనులకు బుధవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో ప్రధాన రోడ్డు 120 అడుగుల వెడల్పు చేయాలని నిర్ణయించారన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత 120 అడుగులైతే భవన యజమానులు భారీగా నష్టపోతారని భావించి, దానిని 100 అడుగులకు కుదించి మున్సిపాలిటీలో తీర్మానం చేశామన్నారు. సుమారు 200 మంది భవన యజమానులుండగా వారిలో 110 మంది 100 అడుగులైతే భారీగా నష్టపోతామని, 90 అడుగులకు కుదించితే టిడిఆర్ బాండ్లు తీసుకోవడానికి సిద్ధమని తెలియజేసి ఒప్పుకోలు పత్రాలు ఇచ్చారన్నారు. వారిని దృష్టిలో పెట్టుకొని 90 అడుగుల వెడల్పుకు పనులు ప్రారంభిం చామన్నారు. 91 మంది కోర్టుకు వెళ్లారని, వారికి నష్టపరిహారం చెల్లించి రోడ్డు పనులు పూర్తి చేస్తామన్నారు. స్థానిక వెంకటేశ్వర స్వామి గుడి నుండి పెద్ద బొడ్డేపల్లి వరకు రోడ్డు వెడల్పుకు రూ. 6 కోట్లు మంజూర య్యాయని, వారం రోజుల్లో టెండర్ ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని మంచి కార్యక్రమాన్ని ప్రారంభించామని, దీనికి వ్యాపారస్తులు, ఇతర వర్గాలు, పార్టీల వారంతా సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, గొలుగొండ జడ్పిటిసి సుర్ల వెంకటగిరిబాబు, మున్సిపాలిటీ వైసిపి అధ్యక్షుడు యాకా శివ, రూరల్ మండలా ధ్యక్షుడు ఎస్‌వివి సత్యనారాయణ, సీనియర్ వైసీపీ నాయకులు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ లక్ష్మీకాంత్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, కార్పొరేషన్ డైరెక్టర్ చోటి, సచివాలయాల కోఆర్డినేటర్ తమరాన శ్రీను, కో ఆప్షన్ సభ్యులు, నాలుగు మండలాల నాయకులు, పట్టణ సీఐ నమ్మి గణేష్, మున్సిపల్ అధికారులు, పాల్గొన్నారు.

పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

లోసింగిలో పాఠశాల ప్రారంభం

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని లోసింగి గ్రామంలో మండల విద్యాశాఖ అధికారులు పి.జాన్ ప్రసాద్, పి.జగ్గారావు ఆధ్వర్యంలో నూతనంగా ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఐదు నుంచి 14 సంవత్సరాల లోపు ఉన్న విద్యార్థులందరినీ తప్పనిసరిగా పాఠశాలకు పంపించాలని సూచించారు. ఏ ఒక్క విద్యార్థి కూడా బడి బయట ఉండడానికి వీలులేదన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం యూనిఫామ్, పుస్తకాలు, బ్యాగులు, పుస్తకాలు సమకూరుస్తుందన్నారు. మధ్యాహ్నం భోజన సదుపాయం కూడా కల్పించడం జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్సీ సిబ్బంది, ఉపాధ్యాయులు నాగు, నరసింహమూర్తి పాల్గొన్నారు. పాఠశాల ఏర్పాటు చేయడం పట్ల సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు, కెవిపిఎస్ నాయకులు ఈరెల్లి చిరంజీవిలు, జిల్లా కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

పూర్తిస్థాయి వికలాంగులకు రూ.5వేల పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి- వడ్డాది: పూర్తిస్థాయి వికలాంగులకు రూ.5000 పెన్షన్ అందించిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కిందనిఎల్ సింగవరం సర్పంచ్ వేపాడ మనిషా తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలో పూర్తిస్థాయిలో ఇంటికే పరిమితమైన ముగ్గురు వికలాంగులకు సాధారణంగా రూ.3000 అందిస్తున్నామన్నారు. ఈ విషయాన్ని సర్పంచ్ వేపాడ మనిషా ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన సంబంధించిన అధికారులతో మాట్లాడి వీరికి రూ.5 వేలు పెన్షన్ వచ్చేలా. ఆదేశాలు జారీ చేశారు. ఈనెల రూ. 5 వేలు పెన్షన్ స్థానిక సర్పంచ్ చేతులు మీదుగా ముగ్గురు వికలాంగులకు అందించారు. ఈ కార్యక్రమంలో వేపాడ మధు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రూ.5వేల పింఛను ఇస్తున్న సర్పంచ్